ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

5

కృష్ణా జిల్లా వార్తలు

బుధవారం 23 అక్టోబరు 2024









చిరునవ్వులు చిందిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ కేశినేని శివనాథ్



డ్రోనాకాశం

కృష్ణాతీరంలో డ్రోన్ షో-2024 సక్సెస్

- ఆకాశంలో అద్భుతాలు సృష్టించిన 5,500 డ్రోన్స్
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఫిదా అయిన వీక్షకులు



కృష్ణాతీరం డ్రోనాతీరమైంది. చీకటిని చీల్చుకుంటూ ఆకాశంలో నక్షత్రాల్లా ఒక్కసారిగా 5,500 డ్రోన్లు దూసుకొచ్చాయి. సప్తవర్ణ చిత్రాలను అత్యద్భుతంగా ఆవిష్కరించాయి. భారీ బోయింగ్ విమానం, డ్రోన్, రాజధాని అమరావతిని స్ఫురించేలా ధ్యానబుద్ధుడు, గ్లోబ్ తదితర చిత్రాలు కనులవిందు చేశాయి. జాతీయ జెండా, ఐసీఏవో లోగో ఆకట్టుకున్నాయి. కృష్ణా తీరాన పున్నమి ఘాట్‌లో మంగళవారం రాత్రి కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌తో నిర్వహించిన డ్రోన్ షో నగరవాసులను విశేషంగా అలరించింది. తర్వాత లేజర్ షో, బాణాసంచా ఫైరింగ్‌తో కృష్ణా తీరంలో దీపావళి ముందుగానే వచ్చినట్లనిపించింది. 6



మిణుగురు పురుగుల వలే ఆకాశంలోకి ఎగురుతున్న డ్రోన్లు

కాల్‌మనీ కేటుగాడు

మచిలీపట్నం కేంద్రంగా అధిక వడ్డీల దందా



బ్యాంకు అధికారులు, వ్యాపారులే ఇతడి లక్ష్యం

- ముందు స్నేహం.. ఆ తర్వాత వారి అవసరాలకు పెట్టుబడి సాయం
- ముక్కుపిండి రూ.లక్షకు రూ. వెయ్యి చొప్పున వసూలు
- ఇదేంటని ప్రశ్నిస్తే వారి ఇంటికెళ్లి దాడులు
- వేధింపులు తాళలేక ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఓ బ్యాంకు మేనేజర్
- విచారణ చేపట్టిన పోలీసులు

అతనో వడ్డీ వ్యాపారి. రియల్ ఎస్టేట్ బ్రోకర్‌నని అందరినీ నమ్మిస్తాడు. వ్యాపారంలో ఎదుగుతున్న వారితో, స్థిరపడిన ప్రముఖ వ్యాపారులతో, బ్యాంకు అధికారులతో పరిచయాలు పెంచుకుంటాడు. స్నేహం నటిస్తూ వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిగా కలిసిపోతాడు. వ్యాపార అవసరాలకు, స్థిరాస్తి కొనుగోలుకు నగదు కావాలంటే ఇస్తానని నమ్మిస్తాడు. రూ.లక్షల్లో పెట్టుబడి పెడతాడు. వారి వద్ద నగదు ఉంటే అధిక వడ్డీలకు తిప్పుతానని తీసుకుంటాడు. ఆ తర్వాత మీకు పెట్టుబడిగా ఇచ్చిన నగదు తనది కాదని, తెలిసిన వారి నుంచి వడ్డీకి తెచ్చినట్లు చెబుతాడు. కొద్ది రోజులు గడిచాక నగదు మొత్తం తిరిగి ఇవ్వాలని పట్టుబడతాడు. ఇవ్వలేని పక్షంలో రూ.లక్షకు రోజుకు రూ.వెయ్యి చొప్పున వడ్డీగా వసూలు చేస్తాడు. ఇదేంటని ప్రశ్నిస్తే దాడులకు దిగి భయభ్రాంతులకు గురిచేస్తాడు. ఇది జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఓ కాల్‌మనీ కేటుగాడి వ్యవహారం. ఇతడి వలలో పలువురు వ్యాపారులు, అధికారులు చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. ఈ వేధింపులు భరించలేక ఎట్టకేలకు ఓ బ్యాంకు మేనేజరు కుటుంబం ధైర్యం చేసి ఇతడి అరాచకాలపై మీకోసం కార్యక్రమంలో ఎస్పీని ఆశ్రయించింది. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేసింది. ఈ విషయం తెలిసి ఈ కేటుగాడి చేతిలో మోసపోయిన మరికొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. బాధితుడు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నంలోని బుట్టాయిపేట సెంటరులోని ఓ బ్యాంకులో మేనేజరుగా పనిచేస్తున్న వ్యక్తికి మచిలీపట్నం నిజాంపేటకు చెందిన వడ్డీ వ్యాపారి పాత మిత్రుడు. దీంతో తరచూ వారి ఇంటికి, బ్యాంకు వద్దకు వచ్చిపోతుండేవాడు. ఈ క్రమంలో మచిలీపట్నంలోని బైపాస్ రోడ్డులో 227 గజాల స్థలం ఉందని, ఆ ప్రాంతంలో గజం స్థలం రూ.30వేల వరకు ఉందని, తనకు తెలిసిన వ్యక్తికి నగదు అత్యవసరం కావడంతో గజం స్థలం రూ.20వేలకు విక్రయించేందుకు సిద్ధపడ్డాడని నమ్మించాడు. స్థలం వద్దకు తీసుకువెళ్లి ఓ వ్యక్తిని పరిచయం చేసి అతనే స్థలానికి యజమాని అని చెప్పాడు. స్థలం కొనుగోలు నిమిత్తం టోకెన్ అడ్వాన్సుగా తొలుత రూ.10లక్షలు ఇవ్వాలని చెప్పాడు. అంతనగదు ఇప్పటికిప్పుడు తనవద్ద లేదని సదరు బ్యాంకు మేనేజర్ చెప్పడంతో ఈ నగదును తానే సమకూరుస్తానని నమ్మించాడు. మరికొద్ది రోజులకు రెండో విడత టోకెన్ అడ్వాన్సుగా రూ.5లక్షలు స్థలం యజమాని అడుగుతున్నాడని చెప్పాడు. ప్రస్తుతం తనవద్ద నగదు లేదని మేనేజర్ చెప్పడంతో ఈ నగదును కూడా తానే సమకూరుస్తానని చెప్పి ఇచ్చాడు.

> **విచారణకు ఆదేశించిన ఎస్పీ**
>
> బ్యాంకు మేనేజరు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్పీ ఆర్.గంగాధరరావు విచారణకు ఆదేశించారు. మచిలీపట్నం డీఎస్పీ ఈ కేసుకు చిలకలపూడి పోలీస్‌స్టేషన్ సీఐను, ఒక ఏఎస్‌ఐను విచారణాధికారులుగా నియమించారు. ఈ కేసులో పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు సదరు సీఐ తెలిపారు.

కొద్దిరోజులు పోయాక మీ కోసం వేరే వ్యక్తి వద్ద నగదును అప్పుగా తీసుకున్నానని, రూ.15 లక్షలకు రోజుకు రూ.15వేల చొప్పున వడ్డీ కింద ఇరవైరోజులపాటు రూ.3లక్షలను వసూలు చేశాడు. ఇంత పెద్దమొత్తంలో రోజువారీ వడ్డీ తాను కట్టలేనని, గతంలో తనవద్ద తీసుకున్న రూ.9లక్షలను జమ చేసుకోవాలని సదరు బ్యాంకు మేనేజర్ చెప్పడంతో వడ్డీ వ్యాపారి రెచ్చిపోయాడు. బ్యాంకు మేనేజర్ ఇంటికెళ్లి నీ ఉద్యోగం పోయేలా చేస్తానని బెదిరించడతో పాటు అతనిపై ఆయన కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మరింత మంది బాధితులు

ఈ వడ్డీ వ్యాపారి చేతిలో పలువురు వ్యాపారులు కూడా చిక్కుకున్నట్లు సమాచారం. గతంలో జవ్వారుపేటకు చెందిన మిగతా 6లో..



విజయవాడ-ఖమ్మం గ్రీన్ హైవేకు లైన్ క్లియర్

243 ఎకరాల భూ సేకరణ పూర్తి

- మరో 30 ఎకరాలకు నోటిఫికేషన్
- నెలాఖరు నాటికి సేకరణ పూర్తి
- 140 ఎకరాల వరకు రైతులకు పరిహారం
- డిసెంబరులో ఎన్‌హెచ్‌కు భూములు స్వాధీనం
- జనవరిలో పనులు ప్రారంభించనున్న మేఘ

6లో

డిస్టలరీల్లో సీఐడీ బృందాల తనిఖీలు!

పలు రికార్డులు స్వాధీనం

6లో

స్నేహితుడే ప్రాణం తీశాడు!

8లో

ఇసుక తవ్వకాలకు వరద బ్రేక్ వేసింది. ఇసుక తవ్వేందుకు అధికారులు 15 రీచ్‌లను గుర్తిస్తే అందులో 11 రీచ్‌ల్లో వరద నీరు నిలిచిపోయింది. మరో నాలుగు రీచ్‌ల్లో అప్రోచ్ రోడ్లు నీట మునిగాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఇసుక తవ్వకాలకు మరో వారం రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. నాగార్జున సాగర్ నుంచి పులిచింతలకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణానదిలో అడుగుపెట్టడానికి అవకాశం లేకుండా పోయింది.



ఇసుకకు వరద బ్రేక్

రీచ్‌ల్లో నిలిచిపోయిన తవ్వకాలు

- తవ్వేందుకు 15 రీచ్‌ల గుర్తింపు
- 11 రీచ్‌ల్లో నిలిచిన వరద నీరు
- మరో నాలుగు రీచ్‌ల్లో మునిగిన అప్రోచ్ రోడ్లు
- తవ్వకాలకు మరో వారం రోజులు పట్టే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లాలో రెండు స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు ఉన్నాయి. మొగలూరు స్టాక్ పాయింట్‌లో 25వేల టన్నులు, అనుమంచిపల్లి స్టాక్ పాయింట్‌లో మరో 25 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. జిల్లా మొత్తం మీద 50 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో కొన్ని మార్పులు చేసింది. రోజుకు 3వేల టన్నుల ఇసుకను తీసుకెళ్లేలా భూగర్భ గనుల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను తీసుకెళ్తుండడంతో నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. దీనితో అధికారులు కొద్దిరోజుల క్రితం కార్మికులతో ఇసుకను తవ్వించాలని నిర్ణయించారు. దీనికి



సంబంధించి టెండర్లను ఆహ్వానించారు. ఈ విధంగా ఇసుకను తవ్వడానికి జిల్లాలో 15 రీచ్‌లను అధికారులు గుర్తించారు. ఈ టెండర్లను అధికారులు ఖరారు చేశారు. వాస్తవానికి ఈ నెల 16 నుంచి రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభం కావాల్సి ఉంది. ఈ పనులకు ఎగువ నుంచి వస్తున్న వరద అడ్డంకి మారింది. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు విస్తారంగా కురవడంతో తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. సెప్టెంబరు ఒకటో తేదీన కృష్ణా నదికి భారీగా వరద వచ్చింది. ఇది క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఈనెల పదో తేదీ నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు మళ్లీ వస్తున్న వరద క్రమంగా పెరుగుతోంది. ఈ నెల ఏడో తేదీన 30వేల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో తాజాగా లక్ష క్యూసెక్కులకు చేరింది. ఎగువ ప్రాజెక్టుల నుంచే కాకుండా, వాగుల నుంచి వస్తున్న నీరు నదిలో కలుస్తోంది. ఫలితంగా నది ఎగువ, దిగువ ప్రాంతాల్లో నిండుగా ప్రవహిస్తోంది. ప్రాజెక్టులు, వాగుల నుంచే కాకుండా పులిచింతలో జలవిద్యుత్ కేంద్రం నుంచి నీరు ప్రకాశం బ్యారేజ్‌కు వస్తోంది. ఈ మూడు కారణాలతో రీచ్‌ల నిండా నీరు చేరింది. 15 రీచ్‌ల్లో 11 రీచ్‌లు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. మరో నాలుగు రీచ్‌లకు ఉన్న అప్రోచ్ రోడ్లను వరద నీరు ముంచెత్తింది. ఫలితంగా రీచ్‌ల్లోకి వెళ్లే మార్గం మూసుకుపోయింది. దీనితో భూగర్భ గనుల శాఖ అధికారులు ఇసుక తవ్వకాలను నిలుపుదల చేశారు. మరో వారం రోజుల్లో నదికి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఇన్‌ఫ్లో తగ్గిన తర్వాతే తవ్వకాలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.











డ్రోన్ల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు







డ్రోన్ శకానికి బెజవాడ వేదిక అయింది. కృష్ణాతీరం ప్రపంచపటంలో నిలిచింది. దేశాన్ని డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి డ్రోన్ సమ్మిట్ క్రియాశీలక అడుగు వేయగా.. డ్రోన్ షో-2024తో దీనిని పతాక స్థాయికి తీసుకు వెళ్లింది. 5,500 డ్రోన్లు నింగిలో సప్తవర్ణ చిత్రాలను ఆవిష్కృతం చేయగా కృష్ణా తీరం పులకించిపోయింది.














డ్రోనాకాశం..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

సరిగ్గా రాత్రి 8.30 గంటలకు డ్రోన్‌షోకు కౌంట్‌డౌన్ మొదలైంది. భూమి మీద నుంచి ఆకాశంలోకి నక్షత్రాలు ఎగురుతున్నట్టుగా డ్రోన్లు వీక్షకుల వెనుకగా లేచాయి. మిణుగురులుగా థీమ్ చిత్రాలను ఆవిష్కరించటం ప్రారంభించింది. డ్రోన్ షో అంతా ఏవియేషన్ థీమ్ మీదనే ప్రధానంగా సాగింది. రైట్ బ్రదర్స్ పరిశోధనలతో నాటి రెక్కల విమానం నేడు అభివృద్ధి చెందిన విమానయాన రంగం కళ్లకు కట్టినట్టు చూపించాయి. రైట్ బ్రదర్స్ రూపొందించిన తొలి తరం విమానంతో కూడిన తొలి ఏవియేషన్ తపాలా బిళ్లను ప్రదర్శించాయి. తర్వాత విమానయాన రంగం విప్లవాత్మక మార్పులతో ఏ విధంగా ముందుకు సాగింది.. ఆధునిక సౌకర్యవంతమైన విమాన ప్రయాణాలకు నిదర్శనంగా అతి పెద్ద బోయింగ్ విమానాన్ని ప్రదర్శించింది. బుద్ధుడి ఛాయాచిత్రాన్ని ఆవిష్కరించాయి. గ్రీన్ ఏవియేషన్ రంగంలో భారతదేశం రానున్న రోజుల్లో ఏ విధంగా విప్లవాత్మకమార్పులు చూపిస్తుందన్నది తెలియచెప్పటానికి గ్లోబల్ ఏవియేషన్ ప్లానెట్ ఛాయాచిత్రాన్ని ఆవిష్కరించింది. నేడు డ్రోన్లు ఏ విధంగా వ్యవసాయ రంగంలో ఉపయోగపడుతున్నాయో ఈ థీమ్‌లో కళ్లకు కట్టినట్టు చూపింది. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ అతిపెద్ద లోగోను డ్రోన్లు ఆవిష్కరించాయి. చివరగా భారతదేశ ఖ్యాతి తెలియజెప్పేలా అతిపెద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆకాశంలో 5,500 డ్రోన్లు కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఆధారంగా నిర్వహించిన డ్రోన్ షో ఆకట్టుకుంది.

ఐదు గిన్నిస్ రికార్డులు

అశేష జనవాహిని సమక్షంలో నిర్వహించిన డ్రోన్ షో ఐదు గిన్నిస్ బుక్ రికార్డులను నెలకొల్పింది. లార్జెస్ట్ ప్లానెట్‌ను ఆవిష్కృతం చేసినందుకు మొదటి రికార్డును నెలకొల్పింది. కృష్ణా తీరంలో అతిపెద్ద ల్యాండ్ మార్క్‌గా రెండోది, భారీ బోయింగ్ విమానాన్ని సృష్టించినందుకు మూడవ గిన్నిస్ రికార్డు, భారీ జాతీయ జెండా ప్రదర్శనతో నాలుగవ, ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ప్రదర్శలో అతిపెద్ద లోగోకు ఐదో అవార్డు దక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రికార్డు పత్రాలను సంస్థ నిర్వాహకులు అందజేశారు.

అబ్బురపరిచిన లేజర్ బీమ్ షో

కార్యక్రమానికి మరో హైలెట్‌గా లేజర్ బీమ్ షో నిలిచింది. పున్నమి ఘాట్‌లోని రెండు ప్రధాన వేదికల దగ్గర లేజర్ బీమ్ షో ఏర్పాటు చేశారు. లేజర్ కాంతులు ప్రాంగణంతో పాటు కృష్ణాతీరం యావత్తూ వెలుగులు జిమ్మాయి. కార్యక్రమ ముగింపుగా బాణసంచా వెలుగులతో ముందుగానే దీపావళి వచ్చింది.

కిటకిటలాడిన పున్నమిఘాట్

ఐదేళ్ల తర్వాత కృష్ణాతీరంలో మెగా ఈవెంట్‌కు అశేషంగా ప్రజలు తరలివచ్చారు. లక్షమందికి పైగానే తరలివచ్చినట్టు అంచనా. డ్రోన్ షో-2024లో నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



హైదరాబాద్ వెళ్లాల్సిన విమానం

గన్నవరంలో ల్యాండింగ్

గన్నవరం : గోవా నుంచి హైదరాబాద్ రావాల్సిన ఇండిగో విమానం ల్యాండింగ్‌కు అనుకూలంగా లేకపోవటంతో గన్నవరం విమానాశ్రయానికి వచ్చింది. మంగళవారం ఇండిగో విమానం గోవా నుంచి 130 మంది ప్రయాణికులతో హైదరాబాద్ బయలుదేరింది. అక్కడ విమానం దిగేందుకు అనుకూలత లేకపోవటంతో గన్నవరం వచ్చింది. ఇక్కడ అర్ధ గంట పాటు ఉండి ఫ్యూయల్ నింపుకుని తిరిగి హైదరాబాద్ వెళ్లింది. దీంతో ప్రయాణికులు కొంత ఇబ్బంది పడ్డారు.

సమగ్రశిక్ష నిధులు విడుదల

మచిలీపట్నం : పీఎం శ్రీ పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్వహణకోసం 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన నిధులను సమగ్ర శిక్ష విభాగం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడికృష్ణా జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు, కేజీబీవీలతోపాటు, జూనియర్ కళాశాలల్లో ఈ నిధులను వినియోగించాల్సి ఉంది. కృష్ణాజిల్లాకు రూ.152.92కోట్లను, ఎన్టీఆర్ జిల్లాకు రూ.132.12 కోట్లను విడుదలచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

కాల్‌మనీ కేటుగాడు

(5వ పేజీ తరువాయి)

ఒక వ్యాపారితో ఈ వడ్డీ వ్యాపారి స్నేహం చేసి, అతనికి కొద్ది మొత్తంలో నగదు ఇచ్చి రూ.60లక్షలు వసూలు చేయడంతోపాటు అతని ఇంటిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. దీనిపై గతంలోనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో కొందరు రాజకీయ నాయకులు ఇతడికి వత్తాసుపలకడంతో ఆ కేసును ఎటూ తేల్చకుండా మరుగునపడేశారు. కోనేరు సెంటరుకు సమీపంలో బంగారం వ్యాపారం చేసే వ్యక్తికి తక్కువ ధరకే బంగారం, వెండి ఇప్పిస్తానని నమ్మించి కోట్లాది రూపాయలను తీసుకున్నట్లు సమాచారం. ఎంతకూ బంగారం వెండి ఇవ్వకపోవడంతో బంగారం కొనేందుకు నగదును అడ్వాన్సుగా ఇచ్చిన వారు బంగారం వ్యాపారిపై పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో ఈ కేటుగాడి బారినపడిన బంగారం వ్యాపారి అప్పుల పాలై విదేశాలకు వెళ్లిపోయాడు. అతనిపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఎట్టకేలకు ఇటీవల హైదారాబాద్ విమానాశ్రమంలో అరెస్ట్ చేసి జైలుకు పంపారు. మరో బంగారం వ్యాపారికి రూ.9లక్షలు అప్పుగా ఇచ్చి రూ.30లక్షలు వసూలు చేసి, మరో రూ.40లక్షలు కడితే నీబాకీ తీరుతుందని ఈ కేటుగాడు బెదిరిస్తుండటం గమనార్హం. మచిలీపట్నంలో బంగారం వ్యాపారం చేసే సుమారు 30 మంది వరకు వ్యాపారులు ఈ కేటుగాడి బారినపడి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు వారంతా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

విజయవాడ-ఖమ్మం

గ్రీన్ హైవేకు లైన్ క్లియర్

- 243 ఎకరాల భూ సేకరణ పూర్తి
- మరో 30 ఎకరాలకు నోటిఫికేషన్
- నెలాఖరు నాటికి సేకరణ పూర్తి
- 140 ఎకరాల వరకు రైతులకు పరిహారం
- డిసెంబరులో ఎన్‌హెచ్‌కు భూములు స్వాధీనం
- జనవరిలో పనులు ప్రారంభించనున్న మేఘ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు భూసేకరణను ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. విజయవాడ-నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా తెలుగు రాష్ట్రాలను కలిపే ప్రాజెక్టులో భాగంగా ఖమ్మం - దేవరపల్లి మధ్య ఇప్పటికే పనులు జరుగుతున్నాయి. ఖమ్మం నుంచి విజయవాడ వరకు 30 కిలోమీటర్ల నిడివిలో పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి సంబంధించి భూసేకరణను జిల్లా యంత్రాంగం కొలిక్కి తెచ్చింది.

ఎన్టీఆర్ జిల్లాలో గంపలగూడెం, జీకొండూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో 30 కిలోమీటర్ల పరిధిలో మొత్తం 274 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 243 ఎకరాలను సేకరించింది. 31 ఎకరాల భూములను ఇంకా సేకరించాల్సి ఉంది. ఈ భూములకు సంబంధించి జిల్లా యంత్రాంగం తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. మరికొద్ది రోజుల్లో ఈ భూములను కూడా సేకరించనున్నారు. ఇప్పటి వరకు 140 ఎకరాలకు రైతులకు పరిహారాన్ని అందించటం పూర్తయింది.



హైవే పనులకు టెండర్లు పూర్తి

ఖమ్మం- విజయవాడ నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పూర్తికాగా మేఘా సంస్థ దక్కించుకుంది. భూములను అప్పగించగానే సంస్థ పనులను చేపట్టనుంది. కేవలం 30 ఎకరాలు మాత్రమే సేకరించాల్సి ఉంది. నెల రోజుల్లో భూములను ఎన్‌హెచ్‌కు స్వాధీనం చేస్తారు. మరోవైపు ఎన్‌హెచ్ కూడా రైతులకు పరిహారం సొమ్మును జమ చేస్తోంది. డిసెంబరులో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో భూములను స్వాధీనం చేస్తే.. జనవరిలో మేఘా సంస్థ పనులను ప్రారంభించనుంది. మహారాష్ట్ర-ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వారధిలా నాగర్‌పూర్-విజయవాడ ఎకనమిక్ కారిడార్ దోహదపడనుంది.

డిస్టలరీల్లో సీఐడీ తనిఖీ!

- పలు రికార్డులు స్వాధీనం

కంచికచర్ల/కంకిపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో పలు డిస్టలరీల్లో మంగళవారం ఉదయం నుంచి సీఐడీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం బాట్లింగ్‌కు సంబంధించి పలు ఆరోపణలు రావడంతో వాటిపై నిగ్గు తేల్చేందుకు కూటమి ప్రభుత్వం డిస్టలరీల్లో జరిగిన అవకతవకలపై విచారణకు ఆదేశించింది. దీనిలో భాగంగా గండేపల్లి సెంథినీ బయోటెక్ కార్మాగారంలో మద్యం బాట్లింగ్ యూనిట్‌లో సీఐడీ అధికారులు సోదాలు జరిపారు. సీఐడీ అధికారులు ఉదయమే కార్మాగారానికి చేరుకుని బాట్లింగ్ యూనిట్ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సోదాల అంశాన్ని చాలా గోప్యంగా ఉంచారు. కార్మాగారంలోకి మీడియాతో పాటుగా ఇతరులెవ్వరినీ సెక్యూరిటీ సిబ్బంది అనుమతించటం లేదు. సాయంత్రం వరకు తనిఖీలు కొనసాగాయి.

కంకిపాడు మండలంలోని దావులూరు, గొడవర్రు



గ్రామాల్లోని డిస్టలరీస్‌లో సీఐడీ అదనపు ఎస్పీ కైలే పాల్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గొడవర్రు గ్రామంలోని బీఏఎస్ డిస్టలరీస్, దావులూరులోని బీఆర్కే స్పిరిట్స్‌లో మధ్యాహ్నం నుంచి తనిఖీలు నిర్వహించారు. గత వైసీపీ పాలనలో డిస్టలరీస్‌లో సరుకు తయారీ, కొనుగోళ్లు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు.

టీడీపీ కౌన్సిలర్ భర్తపై హత్యాయత్నం!

జగ్గయ్యపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, జగ్గయ్య పేట పురపాలక సంఘం మునిసిపల్ కౌన్సిలర్ నోముల స్వప్న భర్త నోముల రఘుపై మంగళవారం సాయంత్రం విజయవాడ ఎస్జీఎస్ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. రఘు స్కూటర్‌పై నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబును కలిసేందుకు వస్తుండగా, ఎస్జీఎస్ కళాశాల సమీపంలో ఎదురుగా ఇర్టిగో వాహనం అడ్డుపెట్టి నలుగురు వ్యక్తులు మంకీ క్యాప్‌లు ధరించి కత్తులతో దాడికి యత్నించారు. స్కూటర్‌ను వాళ్లపైకి నెట్టి రఘు తప్పించుకున్నాడు.




స్టేషన్ ఎదుట బైఠాయించిన టీడీపీ నేతలు, ఎస్సైకి వెంకటేశ్వరరావుకు వివరిస్తున్న రఘు

ఉదయభానుతో ప్రాణహాని : నోముల రఘు

జిల్లా జనసేన అధ్యక్షుడు, మాజీ విప్ సామినేని ఉదయభాను వల్ల తనకు ప్రాణహాని ఉందని, నోముల రఘు ఆరోపించారు. 20వ వార్డులో తన భార్య టీడీపీ తరపున పోటీ చేసినప్పటి నుంచి తనపై కక్షగట్టారని, ఉదయభాను అక్రమ మైనింగ్, ఇసుక, మట్టి రవాణా, గో వధకు మద్దతిచ్చి వేదాద్రి గోశాల నుంచి గోవులను బలవంతంగా తీసుకెళ్లినప్పుడు తాను వ్యతిరేకించానని చెప్పారు. ఇటీవల లైమ్‌స్టోన్ మైన్స్ నుంచి ఉదయబానుకు చెందిన లారీలు ఓవర్‌లోడ్ స్టీల్ ప్లాంట్ బ్రిడ్జి మీదగా రవాణా చేస్తుంటే అధికారులకు ఫిర్యాదు చేసి జరిమానాలు వేయించినట్టు చెప్పారు. ఫోన్‌లో ఆయన అనుచరులు బెదిరించినా పోరాటం ఆపలేదని, తన అడ్డు తొలగించుకోవాలనే కత్తులతో దాడికి పాల్పడ్డారని చెప్పారు. జగ్గయ్యపేట ఎస్సై వెంకటేశ్వరరావు రఘును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

స్టేషన్ వద్ద టీడీపీ నేతల బైఠాయింపు, ఉద్రిక్తత

నోముల రఘుపై హత్యాయత్నం ఘటనపై ఫిర్యాదు చేసేందుకు జగ్గయ్యపేట స్టేషన్‌కు వచ్చిన సందర్భంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. రఘుకు మద్దతుగా అనంతరం టీడీపీ నేతలు వేదులాపురి సైదా, బోస్ యాదవ్, కౌన్సిలర్లు బుజ్జిబాబు, గొట్టి నాగరాజు, కంచేటి గీతారాణి తదితరులు వచ్చారు. రఘుకు సత్వర న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని బైఠాయించి నినాదాలు చేశారు. ఎస్సై జోక్యం చేసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి కేసు నమోదు చేస్తామని, నిందితులను తప్పకుండా పట్టుకుని చట్ట ప్రకారం శిక్షిస్తామని హామీ ఇచ్చారు.

4 కేజీల గంజాయి పట్టివేత

రైల్వేస్టేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ మహిళ నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు జీఆర్పీ సీఐ జేవీ రమణ, ఆర్పీఎఫ్ సీఐ ఫతే ఆలీబేగ్‌లు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రైల్వే డీఎస్పీ రత్నరాజు ఆదేశాల మేరకు స్టేషన్లలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విజయవాడ స్టేషన్‌లో తొమ్మిదో నెంబరు ప్లాట్‌ఫారంపై తనిఖీలు చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం హుబ్లీ జిల్లాకు చెందిన రెహనా (41) అనుమానాస్పదంగా సంచరిస్తున్నదని, ఆమెను అదుపులోకి తీసుకుని ప్రశ్నించామన్నారు. ఆమె బ్యాగ్‌లో 4 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నర్సీపట్నం ప్రాంతంలో గంజాయి తక్కువ ధరకు దొరుకుతున్నందున్న అక్కడ కొనుగోలు చేసి కర్ణాటక రాష్ట్రానికి తరలించి చిన్న పొట్లాలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు నిందితురాలు చెప్పినట్టు తెలిపారు. విశాఖపట్నం నుంచి టిక్కెట్ లేకుండా విజయవాడ చేరుకుందన్నారు. ఇక్కడి నుంచి మరో రైలు ఎక్కేందుకు వేచిఉన్న సమయంలో అరెస్టు చేసినట్టు తెలిపారు.


నిందితురాలితో రైల్వే పోలీసులు


దాసుళ్లపాలెంలో నిరసన తెలుపుతున్న రైతులు

భూ రీ సర్వేలో తప్పులు పరిష్కరించండి

- గ్రామసభ బహిష్కరించిన రైతులు

మైలవరంరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ ఉన్నతాధికారులు రాకుండా గ్రామసభ ఏమిటని దాసుళ్లపాలెం రైతులు గ్రామసభను బహిష్కరించారు. మంగళవారం గ్రామంలోని పాఠశాలలో రెవెన్యూ అధికారులు గ్రామసభను నిర్వహించారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ రీ సర్వేలో తప్పులను పరిష్కరించకుండా అధికారులు గ్రామసభ పెట్టడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమస్యలు ఏమైనా ఉంటే అర్జీలు సమర్పించాలని రైతులను అధికారులు కోరారు. అర్జీలు సమర్పించేది లేదని రైతులు ఆందోళనకు దిగారు. స్కూల్ బయట నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో వందమంది రైతులుంటే 99మందికి రెవెన్యూ సమస్యలు ఉన్నాయని వాపోయారు. సర్వేయర్ల తప్పుల వల్ల బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం కుదరడం లేదని, ఈక్రాప్ కూడా నమోదవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రీసర్వేతో అనేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. గ్రామసభకు ఉన్నతాధికారులు రాకపోతే తమ సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. గ్రామసభకు ఉన్నతాధికారులు వచ్చిన రోజునే సమస్యలపై అర్జీలు సమర్పిస్తామన్నారు. రైతులు సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే ఫీల్డ్‌లో పర్యటించి తప్పులు సరిదిద్దుతామని అధికారులు పేర్కొన్నారు.


సిబ్బందిని నిలదీస్తున్న రైతులు



థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు

థాంక్యూ సీఎం సార్

● రూ.800 కోట్ల బకాయిల విడుదలపై హర్షం

●చంద్రబాబుకు బిల్డర్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు

లబ్బీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోలనే తమకు రావాల్సిన దాదాపు రూ.3 వేల కోట్ల బకాయిల్లో రూ.750 కోట్లు నిధులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నమని బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డి.పంకజ్‌రెడ్డి తెలిపారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బందర్‌రోడ్డు వ్యాస్ కాంప్లెక్స్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో థాంక్యూ సీఎం సార్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పంకజ్‌రెడ్డి మాట్లాడుతూ రూ. 750 కోట్ల బకాయిలు విడుదల చేసి కాంట్రాక్టర్లకు ఊరట నిచ్చారన్నారు. మిగిలిన బకాయిలను కూడా రాబోయే మార్చి నాటికి విడుదల చేయాలని, చిన్న కాంట్రాక్టర బకాయిలు రూ.200 కోట్లు తక్షణ విడుదల చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ సలహా కమిటీ సభ్యుడు సిహెచ్ రామకోటయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బకాయిలు మంజూరు చేసి చేతల మనిషిగా నిరూపించుకున్నారన్నారు. మిగిలిన బకాయిలు కూడా మంజూరు చేసి కాంట్రాక్టర్లను ఆదుకోవాలన్నారు. రోడ్ల అభివృద్ధికి ఒక ప్రణాళికను సీఎంకు అందించామని, దానిని అమలు చేస్తే రాష్ట్రంలోని 45 వేల కిలోమీటర్ల రోడ్లను అద్దంలా తీర్చిదిద్దవచ్చన్నారు. అసోసియేషన్ సభ్యులు థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులను ప్రదర్శించి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ ఛైర్మన్ ఎ.నాగమల్లేశ్వరరావు, మాజీ ఛైర్మన్ బి.రాఘవరావు, వైస్ ఛైర్మన్లు కె.వెంకట నాగిరెడ్డి, ఎన్.నాగేశ్వరరావు, ఎ.కాశివిశ్వేశ్వరరావు, టి.భాస్కరరావు, ట్రెజరర్ పి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వంలో వేసిన శంకుస్థాపన శిలాఫలకం, కింద పిల్లర్ల దశలో ఆర్‌వోబీ

గ్రహణం వీడని గుణదల ఆర్‌వోబీ

● కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసి 15 ఏళ్లు ● గతంలో టీడీపీ ప్రభుత్వంలో కొంత కదలిక
● వైసీపీ పాలనలో కాల్వ కట్టపై ఇళ్ల తొలగింపుతో సరి ● పోరాడుతూనే ఉన్న వామపక్షాలు
● ఆర్‌వోబీ నిర్మాణంతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం ● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గుణదల ఆర్‌వోబీ ఎంతో దోహదం చేస్తుందనేది జగమెరిగిన సత్యం. అయితే ఆర్‌వోబీకి పట్టిన గ్రహణం వీడడం లేదు. 2009లో అధికారంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గుణదలలో ఆర్‌వోబీ నిర్మాణానికి రూ.36 కోట్ల అంచనాతో శంకుస్థాపన చేసి వదిలేసింది. ఆతర్వాత టీడీపీ ప్రభుత్వం టెండర్లు పిలవడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. అయితే, ఆర్‌వోబీ అలైన్‌మెంట్ మార్పులు, కాల్వ గట్లపై నివాసాల తొలగింపు తదితర సమస్యలతో నిధులు చాలవనే భయంలో కాంట్రాక్టర్ పనులు వదిలేశాడు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్‌వోబీపై దృష్టి సారించిన దాఖలాలే లేవు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆర్‌వోబీ నిర్మాణానికి చర్యలు చేపడుతుందని ప్రజలు భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-గుణదల : విజయవాడ నగరంలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, పెరిగిపోతున్న జనాభాకు తగ్గట్టు మౌలిక సదుపాయాలు కల్పించాలన్న ఆలోచనతో 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గుణదల ఆర్‌వోబీ నిర్మాణానికి రూ.36 కోట్లతో అంచనాతో శంకుస్థాపన చేసి వదిలేసింది. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఆర్‌వోబీ నిర్మాణానికి టెండర్లు పిలిచింది. పనులు ప్రారంభించిన కొద్ది రోజులకే ఆర్‌వోబీ ఎలైన్‌మెంట్లో మార్పులు ఉన్నాయని చెప్పడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. నిధులు సరిపోవని, నివాసాల తొలగింపు, విద్యుత్ లైన్ల తొలగింపు లాంటి చాలా సమస్యలు న్యాయం టూ కాం ట్రాక్టర్ పనులు మధ్యలోనే వదిలి వెళ్లిపోయాడు. దీంతో పిల్లర్ల దశలోనే పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొదటగా అడ్డంగా ఉన్న విద్యుత్ టవర్ లైన్లు తొలగింపు, కాల్వ కట్ట వెంబడి ఏలూరు రోడ్డుకు మధ్యలో ఉన్న నివాసాలు తొలగింపునకు చర్యలు చేపట్టారు. రైవస్ కాల్వ, ఏలూరు రోడ్డు కు మధ్యలో ఉన్న నివాసాలు గుణదల సెంటర్ నుంచి గుణదల వంతెన వరకు తొలగించింది. ఈ ప్రాంతంలో నివాసాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు ఇచ్చారు. ఇళ్ల తొలగింపు పనులు పూర్తికాగానే ఆర్‌వోబీ పనులు ప్రారంభిస్తామని ప్రగల్భాలు పలికిన వైసీపీ పాలకులు నాయకులు కిక్కురమనకుండా ఉండి పోయారు. దీంతో కమ్యునిస్టు పార్టీ నాయకులు ఆర్‌వోబీ నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పలు మార్లు ధర్నాలు చేశారు. ప్రస్తుతం ఆర్‌వోబీ నిర్మాణం విషయమై సమాధానం చెప్పే వారే లేరు. గుణదల వంతెనలకు అవతల భాగంలో రెండు దశాబ్దాల కాలంలో అనేక కాలనీలు ఏర్పడ్డాయి. నివాసాలు పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా తయారయింది. బుడమేరు, ఏలూరు కాల్వ, రైవస్ కాల్వలపై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పదేళ్ల క్రితమే బుడమేరు కాల్వపై ఉన్న వంతెన కొంతభాగం కూలిపోయింది. తూములు వేసి తాత్కాలికంగా రాకపోకలు సాగించే చర్యలు తీసుకున్నారు. బుడమేరు వంతెనపై రెయిలింగ్ కొట్టుకుపోయినా పట్టించుకునే వారు లేరు. తాజాగా వచ్చిన బుడమేరు వరదల్లో కూడా రెయిలింగ్ ధ్వంసం అయిపోయింది. తిరిగి రెయిలింగ్ ఏర్పా టు చేసే పనులు చేపట్టారు. ఆర్‌వోబీ నిర్మాణం జరగకపోవడం వల్ల గుణదల శివారు ప్రాంతం అభివృద్ధికి నోచుకోకుండా ఉంది. కూటమి ప్రభుత్వం గుణదల ఆర్‌వోబీ నిర్మాణంపై దృష్టి సారిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.


ముందుగానే నివాసాలను తొలగించిన ప్రాంతం

వరద బాధితుల ఖాతాలకు రూ.235.72 కోట్లు జమ

పెండింగ్ దరఖాస్తులు రేపటిలోగా పరిష్కరిస్తాం : ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా వరద ముంపు బాధితుల్లో 1,44,672 మంది ఖాతాలకు రూ.235.72 కోట్లు జమ చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంకా 2,478 మంది వరద ముంపు బాధితుల దరఖాస్తులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు. బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని 476 మంది ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేసి జమ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న 2,478 దరఖాస్తులను ఈనెల 24వ తేదీలోగా పరిష్కరించి బాధితులకు నష్టపరిహారం చెల్లించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నష్టపోయిన ప్రతి బాధితునికి పరిహారం చెల్లించేలా ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పారదర్శక చర్యలు తీసుకుని ప్రతి ఒక్క బాధిత కుటుంబానికి పరిహారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్నేహితుడి ప్రాణం తీశాడు!



అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వారిద్దరు చిన్ననాటి స్నేహితులు. ఒకే పాఠశాల, కళాశాలల్లో చదువుకున్నారు. చదువు అయిపోయి పెళ్లిళ్ల చేసుకుని ఐదు పదులు వయస్సు దాటినా స్నేహ బంధాన్ని అలానే నిలబెట్టుకున్నారు. వేరు వేరు ఊర్లల్లో స్థిరపడినా అప్పుడప్పుడు కలుసుకుని మంచి చెడులు మాట్లాడుకునే వారు. అలాంటి స్నేహితుల మధ్య మద్యం చిచ్చుపెట్టింది. ఇద్దరి మధ్య ఎలాంటి మనస్పర్థలు లేకపోయినా ఒకరిని ఇంకొరు చంపుకునేంత వరకు తీసుకెళ్లింది. సోమవారం అర్ధరాత్రి నగరంలోని లోటస్ ల్యాండ్ మార్క్‌లో జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన సాగి వెంకట నరసింహరాజు (54) బాల్యంలో విజయవాడలో చదువుకున్నాడు. అనంతరం హైదరాబాద్‌లో సెటిల్ అయిన నరసింహరాజు తనతో పాటు చదువుకున్న ఎండీ రఫీ (54)తో స్నేహాన్ని కొనసాగిస్తున్నాడు. విజయవాడ ఎప్పుడు వచ్చినా మిత్రులు కలుసుకుంటారు. సోమవారం నగరానికి వచ్చిన నరసింహరాజు రఫీని కలిశాడు. లోటస్ ల్యాండ్‌లో ఉన్న తన ఫ్లాట్‌లో ఉన్నానని చెప్పడంతో రఫీ మద్యం తీసుకుని ఫ్లాట్‌కు వెళ్లాడు. అర్ధరాత్రి వరకు మద్యం తాగారు. మాటల మధ్యలో రఫీ తనకు కొంత డబ్బు కావాలని అడిగాడు. డబ్బు అప్పుగా ఇవ్వడానికి నరసింహరాజు అంగీకరించి కొంత గడువు పెట్టాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటా మాట పెరిగి రఫీ పక్కనే ఉన్న కత్తెరతో నరసింహరాజుపై దాడికి ప్రయత్నించాడు. దీంతో నరసింహరాజు నడుముకు ఉన్న టవల్‌ను రఫీ మెడకు బలంగా బిగించి పట్టుకున్నాడు. టవల్‌ను అలాగే పట్టుకుని ఉండటంతో రఫీ అక్కడికక్కడే మృతి చెందాడు. నరసింహరాజు జరిగిన విషయాన్ని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫోన్‌లో తెలియజేసి లొంగిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ ప్రారంభం

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : భారతీయ నవీన్ క్రీడా ఉత్సవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్ వేదికగా తొలి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, విశిష్ట అతిథిగా ఏపీ గ్రాండ్‌మాస్టర్ పి.లలిత్‌బాబు బోర్డుపై చెస్ ఆడి టోర్నీని లాంఛనంగా ప్రారంభించారు. బీఎన్‌కేయు ఫౌండేషన్, ఐకాన్ స్కూల్ ఆతిథ్యంలో ప్రపంచ చెస్ సమాఖ్య, ఏపీ చెస్ అసోసియేషన్ సహకారంతో ఆరు రోజుల పాటు రూ.15లక్షల ప్రైజ్‌మనీతో టోర్నీ నిర్వహించడం ఆనందదాయకమని బొండా ఉమా అన్నారు. ఐకాన్ స్కూల్ డైరెక్టర్లు వై పార్థసారధి, కె రాజేంద్ర, ఛైర్మన్ గుడిపాటి కిషోర్‌లు మాట్లాడుతూ అంతర్జాతీయంగా చెస్ ప్రాముఖ్యత ఈ టోర్నీ చాటి చెబుతుందన్నారు. పోటీల ఏర్పాట్లను కన్వీనర్ షేక్ ఖాసీమ్,డైరెక్టర్ విత్తనాల కుమార్, బీఎన్‌కేయూ ప్రెసిడెంట్ భీమారావు, సీహెచ్ ఎస్ కోచ్ మురళీధర్‌లు పర్యవేక్షిస్తున్నారు.

సీకే నాయుడు క్రికెట్ టోర్నీలో ఆంధ్రాకు ఇన్నింగ్స్ విజయం

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మూలపాడు వేదికగా మేఘాలయతో జరుగుతున్న మల్టీడేస్ క్రికెట్ టోర్నీ కల్నల్ సీకే నాయుడు అండర్-23 మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు ఇన్నింగ్స్ 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మేఘాలయ మూడో రోజు 23/3 పరుగుల ఆట ప్రారంభించింది. ఆంధ్రా బౌలర్ ఇస్మాయిల్ దెబ్బకు కేవలం 125 పరుగులకే కుప్పకూలి పరాజయం పాలైంది. ఇస్మాయిల్ 37 పరుగులిచ్చి 8 వికెట్లను తీశాడు. ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 402/3 వద్ద డిక్లేర్డ్ చేయగా, మేఘాలయ 184కు ఆలౌట్ అయ్యి ఫాలో ఆన్ ఆడుతూ 125 కు రెండో ఇన్నింగ్స్‌లో కుప్పకూలింది. ఈ విజయంతో ఆంధ్రాకు 16 పాయింట్లు రాగా, మేఘాలయకు రెండు పాయింట్లు లభించాయి.

ఉత్సాహంగా ఐస్టా టెన్నిస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ టెన్నిస్ కాంప్లెక్సు విజయ మాధవి టెన్నిస్ క్లబ్‌ల్లో ఆలిండియా సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్ (ఐస్టా) పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజు 35+, 45+, 55+,65+, 70 + విభాగాల్లో అంతర్జాతీయ క్రీడాకారులు చెమటోడ్చారు. సింగిల్స్ రెండో రౌండ్ పోటీలు, డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లు ఫ్లడ్‌లైట్ల వెలుతురులోను సాగుతున్నాయి. ఈ నెల 24వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీల్లో ఐదు కేటగిరుల్లోని విజేతలకు రూ.4లక్షల ప్రైజ్‌మనీ, ట్రోఫీలను ప్రధానం చేయనున్నారు. ఏర్పాట్లను టోర్నీ నిర్వాహకులు రాధాకృష్ణమూర్తి, మల్లికా ర్జునరావు పర్యవేక్షిస్తున్నారు.

ఐదో విడత ఐటీఐ అడ్మిషన్లు

భారతీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి ఐదో విడత అడ్మిషన్లకు ఐటిఐ.ఏపి.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 26వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులో పేర్కొన్న కళాశాలకు ఈనెల 27వ తేదీ సాయంత్రం 3.00గంటలలోగా హాజరై సర్టిఫికెట్లను ధ్రువీకరించుకోవాల్సి ఉందన్నారు.


20 సూత్రాల పథకం ఛైర్మన్ లంకా దినకర్‌ను సత్కరిస్తున్న షేక్ బాజీ తదితరులు

రాష్ట్ర 20 సూత్రాల పథకం ఛైర్మన్

లంకా దినకర్‌కు ఘన సత్కారం

వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర 20 సూత్రాల పథకం ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన లంకా దినకర్‌ను బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. భవానీపురంలోని రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ కార్యాలయంలో దినకర్‌కు దుశ్శాలువాతో సత్కరించారు. షేక్ బాజీ మాట్లాడుతూ బడ్జెట్‌పై పూర్తి అవగాహన ఉన్న దినకర్‌కు ఈ పదవి ఇవ్వ టం అన్ని విధాల సముచితమన్నారు. దినకర్ మాట్లాడుతూ, పేదవారికి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేవిధంగా చూడటమే తన లక్ష్యమన్నారు. తనకు పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర కార్యనిర్వహణాధికారి మధుకర్‌జీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, అనుముల వంశీకృష్ణ, నూతలపాటి బాల కోటేశ్వరరావు, బోగవల్లి శ్రీధర్, పట్నాయక్, అవ్వారు బుల్లిబ్బాయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పొదిలి ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి సంఘటనలో

ట్రావెల్స్ డ్రైవర్లను వెంటనే అరెస్టు చేయాలి

వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొదిలి నుంచి హైదరాబాద్ వెళుతున్న ఆర్టీసీ డ్రైవర్ ఎస్.కె.నజీర్ పై కుర్చేడు వద్ద ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవర్లంతా దాడి చేయడాన్ని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య మంగళవారం ఖండించారు. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్లను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు, ఆర్టీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్‌ను ప్రభుత్వం కట్టడి చేయాలన్నారు. .

టాటా మోటార్స్ ట్రక్ ఉత్సవ్ రేపు

వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 24న దేశ్ కా ట్రక్ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు టాటా మోటార్స్ సంస్థ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. టాటా మోటార్స్ తాజా శ్రేణి ట్రక్కులు వ్యాల్యూయాడెడ్ సర్వీసుతో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు యాజమాన్యం తెలిపింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాన్ని పొందేవిధంగా సేవలు ఉన్నాయన్నారు. ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవడంతోపాటు ఇంకా ఎన్నో ప్రయోజనాలను వివరించనున్నట్లు తెలిపారు. కస్టమర్ల వ్యాపారాలను భవిష్యత్తుకు అనుగుణంగా తీర్చిదిద్దటంతో పాటు అత్యాధునిక ఉత్పత్తులను అందచేయటానికి ఈ వేదిక ఉపకరిస్తుందని సంస్థ కమర్షియల్ వెహికల్స్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ రాజేష్ కౌల్ పేర్కొన్నారు. కస్టమర్లు ట్రక్ ఉత్సవ్‌లో పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకుంటారని భావిస్తున్నామన్నారు.

సీఎం సహాయనిధికి రూ.25 లక్షల విరాళం

పటమట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గంలో పలు కాలనీల ప్రజలు, వివిధ సంఘాలు, స్వచ్ఛం ద సంస్థలు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.25 లక్షల విరాళాన్ని అందజేశారు. విరాళం చెక్కులను ఉండవల్లిలోని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మంగళవారం అందజేశారు. గద్దె తనయుడు గద్దె క్రాంతికుమార్ కూడా ఉన్నారు.


విరాళాల చెక్కులను మంత్రి లోకేశ్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ప్రజాప్రత్యామ్నాయ ప్రణాళికతో వ్యవసాయాభివృద్ధి

● కేరళ మంత్రి ఎంబీ రాజేష్



జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న కేరళ రాష్ట్ర మంత్రి ఎంబీ రాజేష్

గవర్నర్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పరిమిత అధికారాలు, కేంద్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రజాప్రణాళికతో వ్యవసాయ రంగం రక్షణకు, రైతుల సంక్షేమానికి ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం పనిచేస్తోందని కేరళ స్వపరిపాలన, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి ఎంబీ రాజేష్ పేర్కొన్నారు. ఎంబీవీకేలో మంగళవారం జరిగిన జాతీయ సదస్సులో వ్యవసాయ రంగ సమస్యలు-కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంశంపై కేరళ మంత్రి రాజేష్ ప్రసంగించారు. సదస్సుకు ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు వై. కేశవరావు అధ్యక్షత వహించారు. రాజేష్ మాట్లాడుతూ కేరళలో స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. వీటికి కేటాయించిన నిధుల్లో 30 శాతం వ్యవసాయ, దాని అనుబంధ రంగాల రక్షణకు ఖర్చు చేస్తున్నామన్నారు. . రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయని, పంటలకు ధరలు ఉండటం లేదన్నారు. ముప్పేట దాడిలో రైతు సతమతమౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో అన్ని దేశాలు 12 శాతం నుంచి 50 శాతం వరకు రైతుకు ప్రోత్సాహం ఇస్తుంటే, మనదేశంలో అతి తక్కువ శాతం ప్రోత్సాహం దక్కుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ నిపుణుడు కె. అశోక్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆరు స్తంభాల మీద నిలబడి వ్యవసాయ రంగాన్ని నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అఖిల భారత కిసాన్ సభ నాయకుడు పి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రైతు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కనీస మద్దతు ధర సాధించడం కోసం నవంబరు 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. సదస్సులో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. కృష్ణయ్య, కె. ప్రభాకరరెడ్డి, వివిధ వ్యవసాయ సంఘాల నేతలు మర్రాపు సూర్యనారాయణ, వై.రాధాకృష్ణ, ఎం. హరిబాబు, వి. వెంకటేశ్వర్లు, సిహెచ్ నరసింగరావు, ఎస్ ఝాన్సీ, అక్కినేని భవానీప్రసాద్, కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

● ఎంఎస్‌ఎంఈ సమీక్షలో ఎంపీ కేశినేని శివనాథ్


జాబ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే తాతయ్య

వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త నినాదంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలను అభివృద్ధి చేయాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎంఎస్‌ఎంఈ అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. విజయవాడ పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో 2024-25 సంవత్సరానికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రూపొందించిన జాబ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జగ్గయ్యపేట, తిరువూరు, నందిగామ, మైలవరం, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎంఎస్‌ఎంఈలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో కూడా ఎంఎస్‌ఎంఈ పథకాలపై, యూనిట్ స్థాపన, ఉత్పత్తుల మార్కెటింగ్, బ్యాంకు రుణం, రుణాలు చెల్లింపు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెలలోనే ఈ అవగాహనా సదస్సును ఏర్పాటు చేయాలన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతాయ్య, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్, కేవైఐసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రీష్, ఎన్టీఆర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాస్, ఎంఎస్‌ఎంఈ అధికారి కిరణ్, ఇండస్ట్రియల్ సెంటర్ జనరల్ మేనేజర్ సాంబయ్య, ఎన్టీఆర్ జిల్లా ఎల్‌డీఎం ప్రియాంక, జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా ఏపీఎస్‌ఎండీసీ, పీఏడీఎ సీపీవో దుర్గా ప్రసాద్, డీపీవో ఎ.మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ డ్రోన్ సమ్మిట్ సీఎం చంద్రబాబుకే సాధ్యం : ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఢిల్లీ తరువాత ఏపీలోనే జాతీయ డ్రోన్ సమ్మిట్ నిర్వహించటం సీఎం చంద్రబాబుకే సాధ్యమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. భవానీపురం బబ్బూరి గ్రౌండ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం, డ్రోన్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన డ్రోన్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుతో కలిసి శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విజయవాడలో వరద ముంపు సమయంలో బాధితులకు డ్రోన్‌ల ద్వారా ఆహారం, నీరు అందించటం జరిగిందన్నారు. ఏపీని డ్రోన్ హబ్‌గా మార్చేందుకు తొలి అడుగు అమరావతి నుంచే పడటం సంతోషమని తెలిపారు. డ్రోన్ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటిస్థానానికి చేర్చేందుకు ఈ సదస్సు తొలిమెట్టుగా మారుతుందని చెప్పారు. రానున్న రెండేళ్లలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను డ్రోన్ టెక్నాలజీ వినియోగంలో అగ్రగామిగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు.

ఎస్.ఆర్.శంకరన్ జీవితం స్ఫూర్తిదాయకం

● చేనేత, జౌళి శాఖా ముఖ్యకార్యదర్శి సునీత


మాజీ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సునీత

గవర్నర్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బడుగుల సంక్షేమానికి నిర్విరామంగా పని చేసిన మాజీ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ నిరాడంబర జీవితం స్ఫూర్తిదాయకమని చేనేత, జౌళిశాఖ ముఖ్యకార్యదర్శి సునీత అన్నారు. ఎస్.ఆర్.శంకరన్ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం లెనిన్‌సెంటర్‌లోని ఐక్యతాభవన్‌లో శంకరన్ జయంతి నిర్వహించారు. శంకరన్ విగ్రహానికి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం శంకరన్ కృషి చేశారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ నిజాయితీకి మారుపేరు శంకరన్ అన్నారు. మెమోరియల్ కమిటీ కన్వీనర్ జెల్లి విల్సన్ మాట్లాడుతూ శంకరన్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా చేపట్టాలని, శంకరన్ జీవిత విశేషాలను పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్, ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ జయశంకర్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సిహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్‌తదితరులు పాల్గొన్నారు.

తుఫాను కారణంగా పలు రైళ్ల రద్దు

విజయవాడ (రైల్వేస్టేషన్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దానా తుఫాను కారణంగా ఈస్ట్ కోస్టు రైల్వే డివిజన్ పరిధిలో 23, 24 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీన కామాఖ్య - ఎస్ఎంబీటీ బెంగళూరు, సిల్చార్ - సికింద్రాబాద్, డిబ్రూగర్ - కన్యాకుమారి, సికింద్రాబాద్ - భువనేశ్వర్, చెన్నై సెంట్రల్ - హౌరా, పుదుచ్చేరి - హౌరా, చెన్నై - షాలిమార్, పుదుచ్చేరి - భువనేశ్వర్, కెఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్, సీఎస్టీ ముంబయి - భువనేశ్వర్, ఎస్ఎంబిటి బెంగళూరు - గౌహతి, హైదరాబాద్ - హౌరా, కన్యాకుమారి - డిబ్రూగర్, సికింద్రాబాద్ - హౌరా, ఎస్ఎంబిటి బెంగళూరు - హౌరా, సికింద్రాబాద్ - మాల్డా టౌన్, యశ్వంతపూర్ - హౌరా, తిరున్వేలి - షాలిమార్ రైళ్లను రద్దు చేశారు. ఈనెల 24వ తేదీన పూరీ - తిరుపతి, హౌరా - సికింద్రాబాద్, ఖర్గపూర్ - విల్లుపురం, హౌరా - భువనేశ్వర్, షాలిమార్ - చెన్నై సెంటర్, సత్రాగచ్చి - మంగళూరు సెంటర్, హౌరా - తిరుచురాపల్లి, హౌరా - ఎస్ఎంబిటి బెంగళూరు, షాలిమార్ - వాస్కోడగామ, హౌరా - చెన్నై సెంట్రల్, పాట్నా - ఎర్నాకులం, సత్రాగచ్చి - చెన్నై సెంట్రల్ రైళ్లను రద్దు చేశారు.

అమెరికా వెళ్లిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పనులపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అమెరికా వెళ్లారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి మంగళవారం సాయంత్రం అమెరికాకు బయలు దేరారు. తన అమెరికా పర్యటనలో వారం రోజుల పాటు వ్యాపార కార్యకలాపాల్లో, మరో వారం మంత్రి నారా లోకేశ్‌తో పాటు ఐటీ సంస్థల ప్రతినిధులతో చర్చల్లోనూ, ఐటీ సదస్సుల్లో పాల్గొంటారు. అమెరికా పర్యటనను ముగించుకుని వచ్చే నెల 5న తిరిగి రానున్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పార్టీ కార్యాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

వెళ్లాలన్నా..రావాలన్నా నరకమే!

- బస్టాండ్ నిర్వహణలో నిర్లక్ష్యం
- జంక్షన్‌లో రూ.4 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణం
- అప్రోచ్ మార్గం నిర్మించడంలో అధికారుల అలక్ష్యం
- పాత బస్టాండ్‌లో నిలిచిన వర్షం నీరు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన ప్రధాన రహదారి ఆరు నెలలకే అధ్వానం



బస్టాండ్ అవుట్ గేట్ వద్ద గోతులు పడి అధ్వానంగా మారిన రహదారి

(హనుమాన్‌జంక్షన్- ఆంధ్రజ్యోతి)

ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ మరింత అధ్వానంగా మారింది. పాత బస్టాండ్ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన కొత్త బస్టాండ్‌కు ప్రధాన రహదారి నుంచి అప్రోచ్ మార్గం నిర్మించకపోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా నీరు నిలిచి చెరువులా మారి బస్సులు రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. పాత బస్టాండ్ ఆవరణ బాగా లోతట్టులో ఉంది. కొత్త బస్టాండ్ ఆవరణ ఎత్తులో నిర్మించారు. ప్రధాన రహదారి, కొత్త బస్టాండ్ రెండూ మెరకలో ఉన్నాయి. ఈ రెండింటికి మధ్యలో ఉన్న పాత బస్టాండ్ ఆవరణ పల్లంగా మారింది. రహదారి మీద పడ్డ వర్షం నీరంతా పాత బస్టాండ్ ఆవరణలోకి చేరి చెరువులా మారుతోంది. పాత బస్టాండ్ ఆవరణ మీదుగానే బస్సులు కొత్త బస్టాండ్‌లోకి చేరాలి. పల్లంలో నిలిచిపోయిన నీరు డ్రెయినేజీలోకి చేరే అవకాశంలేకపోవడంతో అప్రోచ్ మార్గం వద్ద పెద్ద గొయ్యి ఏర్పడి బస్సులు రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. మురుగు నీరు సైతం పాత బస్టాండ్ ఆవరణలో నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కొత్త బస్టాండ్ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. కొత్త బస్టాండ్‌ను రూ.4కోట్లతో నిర్మించిన ఆర్టీసీ అధికారులు అప్రోచ్ మార్గాన్ని నిర్మించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇదిలా ఉంటే జంక్షన్ బైపాస్ ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రధాన రహదారిని మరమ్మతులు చేసి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌అండ్‌బీ విభాగానికి అప్పగించింది. ఎన్నికల ముందు గత మార్చిలో వేలేరు అడ్డరోడ్డు నుంచి బొమ్ములూరు వరకు 3కి.మీ మేరకు ప్రధాన రహదారిని రూ.9 కోట్లతో అభివృద్ధి చేసింది. పనులు నాసికరంగా ఉన్నాయని అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. వర్షాలకు రహదారిపై ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేటు వద్ద ఏర్పడ్డ గోతులే విమర్శలకు నిదర్శనం. గేటు వద్ద గుంతలు పడి బస్సులు రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. ప్రధాన రహదారికి కొత్త బస్టాండ్ కు మధ్య అప్రోచ్ మార్గం నిర్మించడంతో పాటు రహ దారిపై ఏర్పడ్డ గోతులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పాత బస్టాండ్‌లో చేరిన మురుగు

52 మందికి ఉద్యోగాలు

గన్నవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన, డీఆర్‌డీఏ-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 83 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 52 మందికి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి నిర్వాహకులు నియామకపత్రాలను అందజేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఫీడర్ లైనుల మరమ్మతుల నేపథ్యంలో ఉంగుటూరు సబ్‌స్టేషన్ ఏరియాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ (గుడివాడ)ఈఈ జి.బి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉంగుటూరు పోలీస్‌స్టేషన్, బీసీ కాలనీ, హైస్కూల్, పెట్రోల్‌బంక్ ప్రాంతాలతోపాటు ఎలుకపాడు, ఉంగుటూరు, కొయ్యగూరపాడు గ్రామాల్లోని చేపల చెరువులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరుకు చెందిన కె.భరత్‌కుమార్ భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమాన్ని ఈవో కె.శ్రీనివాస్ పర్యవేక్షించారు.



అన్నదానం చేస్తున్న సత్యప్రసాద్ దంపతులు

విద్యార్థులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆదిత్య బధిర పాఠశాల విద్యార్థులకు శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్, శ్రీదేవి దంపతులు మంగళవారం అన్నదానం చేశారు. విద్యార్థుల మధ్య కేకు కట్ చేసి విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా ఆయన తన ట్రస్ట్ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు ఆకుల వెంకటరమణ, ట్రస్ట్ సభ్యులు మేడేపూడి రామ్మోహన్‌రావు, వీరమాచనేని బుజ్జి, దాసరి బెనర్జీ, దయాల ప్రభాకర్,గొట్టాపు వాసు,కుమార్, సువర్ణరాజు, నాగరాజు, తాడి రంగారావు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలు

గుడివాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ కల్పనలో కళాశాల ఎప్పుడు ముందు ఉంటుందని, విద్యార్థులకు త్వరలోనే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సహకారంతో యాక్సించర్ కంపెనీఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికల్లో సుమారు 100మంది బీబీఏ, బీ కాం, ఎంకాం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో న్యూలైఫ్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభిస్తున్న కుమార్‌రాజా

పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలి

పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

ఉయ్యూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పేదలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యసేవలందించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక కాటూరు రోడ్డులో న్యూలైఫ్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన వైద్య వృత్తి నేడు కొందరు వ్యాపారంగా తయారు చేశారని ఆవేదన వ్యక్తం చేసారు. పేదవారికి తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్యం అందించాలని సూచించారు. బోడె వెంకట్రామ్, బిషప్ స్పర్జియన్ రాజు, దేవసహాయం, కొల్లూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సేవలందించాలి

ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ ఎం.సత్యానంద్

ఉయ్యూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్, మెరుగైన సేవలందించి డిపార్ట్‌మెంట్‌కు ఆదాయంతో పాటు మంచి పేరు తీసుకురావాలని ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ ఎం.సత్యానంద్ అన్నారు. ఉయ్యూరు, గండిగుంటలో మంగళవారం పర్యటించి విద్యుత్ సబ్‌స్టేషన్లు, కార్యాలయంలో రికార్డులు, సౌరశక్తిప్లాంట్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించి పలుసూచనలు చేశారు. విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ, లూజుకనెక్షన్‌లు లేకుండా చూడాలని ఎప్పటికప్పుడు లైన్లు తనిఖీ చేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కోతలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య లేకుండా చూడాలన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

భారతదేశాన్ని గ్రీన్ ఎనర్జీగా చేయాలన్న ప్రధానమంత్రి లక్ష్యంలో భాగంగా సౌర విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలుంటాయన్నారు. ప్రభుత్వం సౌరవిద్యుత్ ప్యానల్స్ ఏర్పాటు చేసు కోవడానికి బ్యాంకుద్వారా సబ్సిడీ లోన్ సౌకర్యం ఏర్పాటు చేసిందన్నారు. సదుపాయం ఉన్న ప్రతి ఇంటిపై సౌర విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. డీఈఈ డి.కృష్ణనాయక్, డిప్యూటీ ఈఈ హేమకుమార్ పాల్గొన్నారు.



ఉయ్యూరు సబ్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్ఈ సత్యానంద్



మాట్లాడుతున్న డీఈవో తాహేరా సుల్తానా

సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలి

డీఈవో తాహేరా సుల్తానా

గన్నవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలని డీఈవో తాహేరా సుల్తానా అన్నారు. మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రయోగాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో డీఈవో తాహేరా సుల్తానా మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహదప డతాయన్నారు. విద్యార్థులను భాగస్వామ్యం చేయటం నేర్చుకోవటం కోసమేనని తెలిపారు. సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంపొందించుకునే సైన్స్ ఎగ్జిబిషన్ల లక్ష్యమన్నారు. గురుకులాల జిల్లా ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్ ప్రేమావతి, ఎంఈవో కె.రవి కుమార్, ప్రిన్సిపాల్ యశోధలక్ష్మి, వీరపనేనిగూడెం, గొల్లనపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధన్వంతరి జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

పెనమలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద తొలి వైద్యులు భగవాన్ ధన్వంతరి జయంతిని ఏపీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు మంగళవారం మంత్రి కొలుసు పార్థసారథి కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో 2016 అక్టోబరు 28న ధన్వంతరి జయంతిని ప్రధాని మోదీ చేతులమీదుగా ప్రారంభించడం జరిగిందని, ఆరోజు నుంచి ప్రతియేటా ధన్వంతరి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ వైద్య వృత్తిలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందించడం జరుగుతోందని, ఇదే సంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు వణుకూరు సురేష్‌బాబు, పాతూరు మురళీకృష్ణ, అన్నవరపు బ్రహ్మయ్య, ఆకునూరు సుబ్బారావు, మల్కాపురం కనకారావు, కాపవరపు ప్రసాద్, ద్రాక్షారపు సూరిబాబు, గోనుగుంట్ల యల్లమందయ్య తదితరులు ఉన్నారు.



మంత్రి పార్థసారథికి వినతిపత్రం ఇస్తున్న నాయీబ్రాహ్మణ నాయకులు

పల్లెపండుగతో గ్రామాల అభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందించడం హర్షణీయమని సర్పంచ్ వీరాంజనేయులు అన్నారు. రామన్నగూడెంలో రూ.12లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రహదారికి మంగళవారం వడ్లమూడి నాని, శ్రీనివాసరావులతో కలిసి శంకుస్థాపన చేశారు. గత ఐదేళ్లుగా పంచాయతీల్లో పడకేసిన అభివృద్ధిని పల్లెపండుగ ద్వారా పునరుత్తేజం చేశారన్నారు. గ్రామాల్లో మౌలికసదుపాయాలకల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చలసాని శ్రీనివాస్, ముదరబోయిన దాసు, జూపూడి బాలకృష్ణ, రాఘవ పాల్గొన్నారు.



రామన్నగూడెంలో సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ వీరాంజనేయులు, వడ్లమూడి నాని, చలసాని శ్రీనివాస్

ఎలుకలను సామూహికంగా నిర్మూలించాలి

ప్రసాదంపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నట్లు ఏవో రంగనాథ్ అన్నారు. మంగళవారం గూడవల్లి పంచాయతీ కార్యాలయంలో పొలం పిలుస్తోంది, సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు సేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఎకరాకు 100 గ్రాములు చొప్పున మందు పెట్టాలన్నారు. 95 గ్రాముల నూకలు, 2 గ్రాములు మంచినూనెలో 2 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును కలిపి గుర్తించిన బొరియల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ చింతలమ్మ, ఏఈవో ఆర్.సురేష్, వీఏఏ ఆర్.శ్రావణి, ఏ. లక్ష్మి ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

నట్టల నివారణతోనే జీవాల్లో ఎదుగుదల

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నేలకు దగ్గరగా ఉన్న పచ్చిమేత మేయడం వల్ల జీవాల్లో నట్టల బెడద ఉత్పన్నమవుతుందని, పేడ నమూనా పరిశీలనతో తగు మోతాదులో మందులు వాడాలని పశుగణ సహాయకుడు కె.రామకృష్ణ సూచించారు. మల్లవల్లిలో గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సంఘ ఆధ్వర్యంలో మంగళవారం నట్టల నివారణపై అవగాహన, మందుల పంపిణీ నిర్వహించారు. నట్టల నివారణ మందు ఏడాదికి మూడు సార్లు వేయడం వల్ల జీవాలకు పోషకాలు అంది ఆరోగ్యంగా సరైన ఎదుగుదలకు ఉపయోగపడతాయని వివరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	138,147, 158
చికెన్ విత్ స్కిన్	266
చికెన్ స్కిన్‌లెస్	276
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 540	



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	138,147,158
చికెన్ విత్ స్కిన్	266
చికెన్ స్కిన్‌లెస్	276

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

పూర్ణచంద్రారెడ్డికి పలువురి అభినందనలు

పామర్రు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): పామర్రు పట్టణంలోగల అన్నపురెడ్డి నాగేంద్రరెడ్డి మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.పూర్ణ చంద్రా రెడ్డికి భారత మాజీ రాష్ట్ర పతి అబ్దుల్ కలామ్ ప్రతిభా పురస్కారం లభించింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పలువురు ప్రముఖులకు గుంటూరు ఎసి కళాశాలలో ఈనెల 20న ఎస్‌పిఎల్‌టిఓ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయిలో ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవంలో ఈఅవార్డును ఆయన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, తాడికొండ ఎమ్మెల్యే గుంటూరు ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, నజీర్ చేతులమీదుగా అందుకున్నారు. అవార్డు అందుకున్న పూర్ణచ్రందారెడ్డిని పలువురుప్రముఖులు అభినందించారు.



అవార్డుఅందుకుంటున్న పూర్ణచంద్రారెడ్డి

రహదారులు ఇలా .. పయనమెలా..!

- ధ్వంసమైన రహదారులతో ప్రయాణికులకు తప్పని తిప్పలు
- గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం ఈ రహదారులు

(ఆంధ్రజ్యోతి - పామర్రు) : మండల పరిధిలోని పామర్రు- జమీగొల్వేపల్లి రహదారి పూర్తి అధ్వానస్థితి చేరుకోవడంతో ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. పామర్రు నుంచి దాదాపు ఏడు కిలోమీటర్ల పొడవుగల ఈ రహదారి ఆర్‌అండ్‌బి శాఖకు చెందిందిగా గ్రామస్తులు పేర్కొంటున్నారు. పామర్రు నుంచి చెన్నువానిపురం బల్లిపర్రు, పెదమద్దాలి, జమీగొల్వేపల్లి వరకు గల రహదారి ధ్వంసమై గోతులమయంగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకల సమయాల్లో పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. గోతులమయమైన ఈ రహదారిపై ఆటోలు సైతం రావడం లేదు. ఆటోలు రాకపోవడంతో ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధ్వంసమైన రహదారిలో నిన్నా, మొన్నటి వరకు వచ్చే ఆర్టీసీ బస్సును సైతం ఈ రూట్‌లో రద్దు చేసింది. దీంతో ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పెదమద్దాలి నుంచి కొత్తూరు వెళ్లే ప్రధాన రహదారి సైతం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో కొత్తూరు గ్రామస్థులు పెదమద్దాలి పంచాయితీ కార్యాలయానికి వెళ్లేందుకు పామర్రుకు వచ్చి బైపాస్ మీదుగా పెదమద్దాలికి చేరుకుంటున్నామని వాపోతున్నారు. అధ్వాన స్థితికి చేరిన గ్రామీణప్రాంత రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వల్లే రహదారులు ఈ దుస్థితికి చేరాయని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. త్వరలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి కూటమి సర్కార్ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పామర్రు చెన్నువానిపురంలో..



గోతుల్లో వర్షపు నీటితో నిండి ఉన్న రహదారి ..

విద్యార్థుల బాధలు వర్ణనాతీతం

అడుగడుగునా గోతులతో ఈ రహదారిపై నడవలేకపోతున్నాం. దీనికితోడు ట్రాక్టర్లు , ఆటోల తాకిడికీ గోతుల్లోని రాళ్లు పైకి తేలాయి. దీంతో నిత్యం విద్యార్థులు రాకపోకల సమయాల్లో పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈరహదారి దుస్థితిపై స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలి.



\- సుక్రాంతి

రహదారులకు మరమ్మతులుచేపట్టాలి

చిన్నపాటి వర్షాలకే ఈరహదారిపై ఉన్న గోతులన్నీ వర్షపు నీటితో నిండిపోతున్నాయి. గత పాలకుల నిర్లక్ష్య వైఖరితో రహదారులన్నీ అధ్వానంగా మారాయి. ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలి.



\- బోతనబొట్ల ఫణీంద్ర

విద్యార్థికి అభినందన

పెదపారుపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న డి.యోధిత జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి ఖో- ఖో పోటీల్లో (అండర్-14) విభాగంలో పాల్గొననున్నట్టు ప్రధానోపాధ్యాయురాలు వి.పద్మావతి మంగళవారం తెలిపారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ఎం.సోమేశ్వరరావు అభినందించారు. సర్పంచ్ కె.అనూష, ఉపసర్పంచ్ సూరపనేని సత్యనారాయణ, విద్యా కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రాంగణ ఎంపికలు

గుడివాడ : ఉద్యోగ కల్పనలో కళాశాల ఎప్పుడు ముందు ఉంటుందని, విద్యార్థులకు త్వరలోనే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సహకారంతో యాక్సించర్ కంపెనీఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికల్లో సుమారు 100మంది బీబీఏ, బీకాం, ఎంకాం, విద్యార్థులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్ ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డా.పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, పాల్గొన్నారు.

వైద్య శిబిరం

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాల విద్యార్థుల ఉచిత నేత్ర వైద్య పరీక్షా శిబిరాలు మంగవారం ప్రారంభించారు. స్థానిక ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ హైస్కూల్ విద్యార్థులకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల గుడ్లవల్లేరు విద్యార్థులు 400 మందికి పరీక్షలు నిర్వహించారు. కాగా వారిలో 65 మందికి కళ్ల జోళ్లు అవసరంగా గుర్తించారు వారికి ఉచితంగా కళ్ల జోళ్లు ఇస్తామని క్లబ్ అధ్యక్షురాలు శశికళ తెలిపారు. శిబిరాలకు లయన్స్ మాజీ గవర్నర్ ఎ.ఆర్.కె చౌదరి తన కుమారుడు అరెకపూడి శ్రీహర్ష జ్ఞాపకార్థం ఆర్థిక సాయం అందించారు. హైస్కూల్ ప్రిన్సిపాల్ లీనా సాతులూరి, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, లయన్స్ మాజీ గవర్నర్ వై.పి.సి ప్రసాద్, కార్యదర్శి పెరుమాళ్లు, కోశాధికారి నవాబు, జంగం మోహనరావు, పరందామయ్య తదితరులు పాల్గొన్నారు.

27న సర్వ సభ్య సమావేశం

గుడివాడ : స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల పూర్వ విద్యార్థి సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 27వ తేదీన కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు అట్లూరి పరంధామరావు, కార్యదర్శి డా.ఎన్.కృష్ణమోహన్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థి సంఘం సభ్యులందరు హాజరుకావాలని కోరారు.

ఫ్లెక్సీ వివాదం

గుడివాడ : మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని పుట్టినరోజును పురస్కరించుకుని పెద ఎరుకపాడు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీని టూటౌన్ పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం అర్ధరాత్రి స్థానిక పెద ఎరుకపాడు దిబ్బ వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయడానికి పూనుకున్నారు. అనుమతులు లేకపోవడంతో టూటౌన్ పోలీసులు అడ్డుకున్నారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతరావు, చంటిలు సంఘటనాస్థలానికి చేరుకుని పోలీసులతో మాట్లాడారు. జిల్లా ఎస్.పి గంగాధరరావు అనుమతులు లేవని తేల్చడంతో చేసేదేమిలేక ఫ్లెక్సీని పెట్టకుండానే వెనుదిరిగారు.

27న శంకరశాస్త్రి శతజయంతి సభ

గుడివాడ: కవి, రచయిత ఆరుద్ర భాగవతుల సదాశివ శంకరశాస్త్రి శతజయంతి సభను ఈ నెల 27వ తేదీ ఆదివారం స్థానిక ఏజెకె మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి అధ్యక్ష, కోశాధికారి లంకా సురేంద్ర, యలమర్తి కోటేశ్వరరావులు తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం రేపు

గుడివాడ : పిసిసి అధ్యక్షులు షర్మిలారెడ్డి పిలుపు మేరకు ఈ నెల 24వ తేదీన గుడివాడలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వద్దాది రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

గుడివాడ,అక్టోబర్22(ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లుగా నియోజకవర్గంలో పంటకాలువలు, డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేయలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నియోజకవర్గంలోని ఇరిగేషన్, డ్రెయినేజీ కాలువల అభివృద్ధికి రూ.7.73కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నెహ్రాల్లి, మోటూరు ఛానల్, భూమికోడు తదితర కాలువల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో అలసత్వం కనబరిస్తే చర్యలు తప్పవన్నారు. నిర్లక్ష్యపూరితంగా పనులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రూ.6.03కోట్లతో డ్రెయినేజీ పనులు, రూ.1.70కోట్ల వ్యయంతో ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతులకు మరింత మేలు జరిగేలా గ్రామాల్లో చిన్న చిన్న కాలువల్లో సైతం పూడికతీత పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఇరిగేషన్ డి.ఇలు సూర్యభరత్, శ్రీను, డ్రెయినేజీ డీఈలు గణపతి, ఏఈలు కుమార్, అనీల్, బేగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెనిగండ్ల

రైతులు రెండో పంటకు సిద్ధమవ్వాలి

గుడివాడ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : వరి పొలాల్లో 1318 రకం ఎక్కువగా రైతులు సాగుచేశారని, ఆ పైరుపై ఎక్కువ మోతాదులో ఎరువులు వేయవద్దని సీనియర్ శాస్త్రవేత్త యు.విజయభాస్కర్ రెడ్డి సూచించారు. మంగళవారం దొండపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చిలకమూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది తుఫాన్ కారణంగా పలు పొలాలు దెబ్బతిన్నాయన్నారు. పాక్షికంగా దెబ్బతిన్న వరి పొలాలకు దిగుబడులు ఎక్కువగా రావన్నారు. రైతులు అధైర్య పడకుండా రెండవ పంటకు సిద్ధమవ్వాలని కోరారు. ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి మాట్లాడుతూ వరి పైరు పొట్ట దశలో ఉందని, మేఘాలు, మబ్బులు పడుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పొలంలో ఏదైనా మార్పులు కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖాధికారులను సంప్రదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి బోలెం అనంతలక్ష్మి, వీపీఏ భవాని, చిలకమూడి, దొండపాడు రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయభాస్కర్

కలప మాయంపై ఫిర్యాదు

కూచిపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : భారీ వృక్షానికి సం బంధించిన కలప మాయమవడం పై గ్రామస్థులు అధికారులకు ఫి ర్యాదు చేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మొవ్వ - కొడాలి మధ్య భారీ వృక్షం కూలింది. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేసేందుకు పోలీసులు, పం చాయతీ సిబ్బంది వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వృక్షాన్ని మె షిన్ల సహాయంతో ముక్కలుగా కట్ చేసి రోడ్డు పక్కన వేశారు. రెండు రోజులకే కలప మాయం కావటం తో మొవ్వ గ్రామస్థులు ఆరా తీశా రు. ఎవరిని అడిగినా తెలియదని చెప్పటంతో ఆర్‌అండ్‌బి ఇతర శాఖ ల అధికారులకు మంగళవారం ఫి ర్యాదు చేశారు. వృక్షాలు నేలకొరిగి న సమయంలో ఆర్‌అండ్‌బి అధికారులు బహిరంగ వేలం పాట ద్వా రా వృక్షాలు విక్రయిస్తుంటారు. అధికారులు ఆ కలపను తమ సమక్షంలో విక్రయించలేదని చెబుతున్నారు.



నేలకొరిగిన భారీ వృక్షం(ఫైల్)

మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలన

కూచిపూడి : కోసూరు జడ్పీ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారుల బృందం మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న భోజనం నాణ్యత బాగుండలేదని, పాఠశాల పేరెంట్స్ కమిటీ నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఎండివో విమాదేవి, తహసీల్దార్ మస్తాన్, ఎంఈవోలు శివశంకర్, శ్రీలక్ష్మి, ఈవోపిఆర్‌డి పరామత్మలు ఆకస్మికంగా పరిశీలించారు. అధికారుల పరిశీలనలోనూ భోజనం రుచిగా లేదని తేలింది. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ భోజనం రుచికరంగా ఉండే విధంగానూ, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలయ్యే విధంగానూ చూడాలని అధికారులు కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొరవడిన పారిశుధ్య నిర్వహణ

గుడివాడ : వర్షాలకుతోడు పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సుం దరయ్యభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని చెత్త నిర్వహణ, డంపింగ్ యార్డుకు తరలింపులో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చాలా మంది వైరల్ జ్వరాలతో పాటు కీళ్ళనొప్పులు వంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు శ్రద్ధతో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకో వాలన్నారు. ఈసమావేశంలో ఐద్వా కార్యదర్శి పి.రజిని పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

పామర్రు : గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూయజమానులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల పరిష్కర సాధన కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని పామర్రు తహసీల్దార్ గూడపాటి రవికాంత్ అన్నారు. స్థా నిక గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం గ్రామ సర్పంచ్ కేతావతు కస్తూరి అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గతంలో నిర్వహించిన భూ రీసర్వేలో తప్పులను సభలో వచ్చిన అర్జీలను పరిశీలించి మండల స్థాయిలో గల లోపాలను తక్షణమే సరిచేయడం జరుగుతుందన్నారు. మిగిలిన సమస్యలను ఆన్‌లైన్ చేసి వాటిని తొంబై రోజుల్లోగా పరిష్కరించాలనే లక్ష్యమే ఈగ్రామ సభల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఎంపిపి దాసరి అశోక్‌కుమార్ , సమగ్ర భూ రీసర్వే డిప్యూటి తహసిల్దార్ వేమూరి గంగాధరరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, ఆర్ఐ అల్లూరి రాము,విఆర్వోలు బేబి సరోజని, ఉషా,రచన, కూమార్ సచివాలయ పాల్గొన్నారు.

కచ్చా డ్రెయిన్లకు మరమ్మతులు

పెదపారుపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సూచనల మేరకు వానపాముల గ్రామం లో గత నాలుగైదు రోజులుగా డ్రెయిన్లలో పూడికతీత , కొత్త కచ్చా డ్రెయిన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పాతూరి రమేష్ తెలిపారు. ఈ నెల 17వ తేదీన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన సందర్భంలో స్థానిక నాయకులు డ్రెయిన్ సమస్యను వారి దృష్టికి తెచ్చారు. ఆ మరునాడు నుంచే మినీ జేసీబీ తెప్పించి పనులకు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగితం లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సచివాలయాల్లో తొలగించని మాజీ సీఎం శిలాఫలకాలు

- కనిపించని సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలు
- తొలగించని పాత అధికారుల పేర్లతో ఉన్న శిలాఫలకాలు

గుడివాడ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలవుతున్నా సచివాలయ సిబ్బంది చేష్టలు జగన్ ప్రభుత్వం ఉన్నట్లే భావిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని సచివాలయాల్లో జగనన్న నవరత్నాలు, జగనన్న పథకాలు తొలగించకుండా అలాగే ఉంచి పరిపాలన కొనసాగిస్తున్నారు. టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం వచ్చి నాలు గు నెలలు అవుతున్నా సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల విగ్రహాల ఫొటోలు గానీ, ఆ పథకాలు కానీ కొన్ని సచివాలయాలు గానీ కొన్ని సచివాలయాల్లో కనిపించటం లేదు. సిబ్బందిని అడిగితే సమాధానం కానరాకుండా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటివి తొలగించి నూతన కూటమి ప్రభుత్వ పథకాలు, బ్రోచర్లు, ఫొటోలు ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతున్నారు. టీడీపీ, జనసేన నాయకులు జగనన్న నవరత్నాలు తొలగించకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది సమయానికి రావటం లేదని వాపోతున్నారు. శెరిగొల్వేపల్లి సచివాలయంలో ఇటువంటి బోర్డులు కనిపిస్తున్నాయి. సచివాలయ ముందు జగనన్న నవరత్నాలు, జిల్లాలు మారిపోయిన అధికారుల పేర్లు కూడా తొలగించకుండా శెరిగొల్వేపల్లి సచివాలయం వద్ద అదేవిధంగా ఉంచారు. ఎంపిడివో డి.వై.విష్ణుప్రసాద్ వివరణ కోరగా, ఇటువంటివి వెంటనే తొలగిస్తామని తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ విధివిధానాలు ఏ విధంగా నడుచుకోవాలో వెంటనే సమావేశం ఏర్పాటు చేసి తెలియజేస్తానని తెలిపారు.





తొలగించని జగనన్న నవరత్నాల శిలాఫలకాలు

ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ, అక్టోబర్22(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రయివేట్ ఐ.టి.ఐ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఐదో విడత అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కె.బి.ఆర్ ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 10 తరగతులు పాసైన విద్యార్థులు ఐటిఐ.ఏపి.జివోవి.ఇన్ ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 27వ తేదీన సర్టిఫికేట్‌ల వెరిఫికేషన్ కొనసాగుతుందన్నారు. 28వ తేదీన ప్రభుత్వ ఐటీఐలో, 30వ తేదీ ప్రయివేట్ ఐటీఐలలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు 08674-295953, సెల్ నెం. 82975 74757లకు సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి తెలిపారు.

ఘనంగా గార్మీ షరీఫ్ వేడుకలు

పెదపారుపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో గార్మి షరీఫ్ జెండాల పండుగను ముస్లింలు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు జెండాలను గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	266
చికెన్ స్కిన్‌లెస్	276

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.540

నాగుల చవితి కరపత్రాలు ఆవిష్కరణ



అవనిగడ్డ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి జరిగే వార్షిక మహోత్సవాల్లో ప్రతిష్ఠాత్మకమైన నాగుల చవితి పర్వదిన కరపత్రాలు ఆవిష్కరణ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌చే జరిపారు. మంగళవారం సాయంత్రం ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు నాగులచవితి, లక్ష బిల్వార్చన, కార్తీక మాసంకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

గోతులమయం!

- పోతేపల్లి రోడ్డులో వలందపాలెం వద్ద ధ్వంసమైన రోడ్డు
- ప్రమాదాల బారిన ద్విచక్ర వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు



గుంతలతో అధ్వానంగా పోతేపల్లి రోడ్డు

(మచిలీపట్నం టౌన్ - ఆంధ్రజ్యోతి)

మచిలీపట్నం నుంచి పోతేపల్లికి వెళ్లే రోడ్డులో వలందపాలెం వద్ద రోడ్డు గుంతలమయమైంది. దీంతో పోతేపల్లి వెళ్లే ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురి కావలసి వస్తోంది. బీసీ వెల్ఫేర్ హాస్టల్ ముందు రోడ్డు గుంతలతో నిండిపోయింది. ద్విచక్ర వాహనాలు నడిపేందుకు వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల ఇమిటేషన్ జ్యూయలరీ పార్కులో జరిగిన కార్యక్రమాలకు మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డి.కె. బాలాజీలు ఇదే రోడ్డుపై వెళ్లారు. రోడ్డు శిథిలమైందని, మరమ్మతులు చేయించమని మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డి.కె. బాలాజీలకు జ్యూయలరీ పార్కు పాలకవర్గ ప్రతినిధులు తెలిపారు. వివిధ శాఖల అధికారులు మంత్రి వెంట వెళుతున్నప్పటికీ ఈ రోడ్డు మరమ్మతులపై దృష్టి సారించడం లేదు. రోడ్డును మరమ్మతులు చేపట్టాలని పోతేపల్లి, పోతిరెడ్డిపాలెం ప్రజలు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు



రోడ్డు గోతులమయం కావడంతో జ్యూయలరీ పార్కుకు వచ్చే వేలాది కార్మికులతో పాటు పోతేపల్లి, పోతిరెడ్డిపాలెం గ్రామాలకు వెళ్లే ప్రజలు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. త్వరగా రోడ్డు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- అంకెం జితేంద్ర



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కె స్వాతి

బాణసంచా దుకాణాల వద్ద

గట్టి భద్రతా ఏర్పాట్లు చేయాలి: ఆర్డీవో

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బందరు డివిజన్‌లోని వివిధ మండలాల్లో దీపావళి బాణసంచా దుకాణాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని మచిలీపట్నం ఆర్డీవో కె. స్వాతి సూచించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ మండలాల తహసీల్దార్లు, పోలీసు అధికారులతో బాణసంచా దుకాణాల ఏర్పాటుపై ఆర్డీవో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాణసంచాల దుకాణాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా సంఘటన జరగక ముందే పసికట్టాలన్నారు. మచిలీపట్నంలో 150 దుకాణాలు ఒకే చోట ఏర్పాటు చేయడం మంచిదికాదన్నారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా తగిన శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బందరు తహసీల్దార్ మధుసూద నరావు, ఏవో లతీఫ్ పాషా, చిలకలపూడి సీఐ నబీ, అవనిగడ్డ సీఐ యువ కుమార్, అగ్నిమాపక అధికారి నరసింహారావు, విద్యుత్‌శాఖ డీఈఈ శ్రీనివాసులు, పెడన మునిసిపల్ కమిషనర్ గోపాలరావు పాల్గొన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ

మోపిదేవి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సంభవించిన కృష్ణానది వరదల కారణంగా సర్వం కోల్పోయిన కె.కొత్తపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎస్ఆర్ఐ పి.ధనుంజయరావు ఆర్థిక సహకారంతో నోటుపుస్తకాలు, పెన్నులు, దుస్తులు పంపిణీ చేశారు. ఎంఈవోలు దుర్గాసాగర్, అన్నపరెడ్డి పిచ్చియ్యలు నోటుపుస్తకాలు, దుస్తులను అంద జేశారు.



రేవుకు చేరిన వరద నీరు

నాగాయలంక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 70 గేట్లు ఎత్తి దిగువకు వరద నీరు విడుదల చేశారు. దీంతో మంగళవారం నాగాయలంక రేవులోకి వరద నీరు భారీగా చేరింది. రెవెన్యూ, పోలీసు శాఖ వరద ప్రవాహాన్ని పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

తగ్గిన వరద

అవనిగడ్డ రూరల్ : ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలవుతున్న వరద నీటి ప్రవాహం ప్రస్తుతం పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద 1.60 లక్షల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం కొనసాగుతుంది. సోమవారం 2.20 లక్షల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం ఉండగా, ఇన్‌ఫ్లో తగ్గటంతో ప్రస్తుతం పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద 1.60 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుంది.

నేడు కేయూకు నాక్ బృందం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ బృందం బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయానికి రానున్నట్టు కేయు వీసీ ఆర్. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మూడు రోజుల పాటు నాక్ బృందం విశ్వవిద్యాలయంలో అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారన్నారు. విశ్వవిద్యాలయం స్థాపించిన తరువాత తొలిసారి నాక్ బృందం వస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామన్నారు.

దాలిపర్రులో గ్రామసభ

ఘంటసాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దాలిపర్రు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ, దాలిపర్రులో రైతుల నుంచి 9 అర్జీలు స్వీకరించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డొకిపర్తి శాంతకుమారి, టీడీపీ నాయకులు మిక్కిలినేని మధు, వీరమాచి నేని భవాని ప్రసాద్, మండల సర్వేయర్ వల్లి పుష్ప, రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

విశ్వనాథపల్లి నాంచారమ్మ ఆలయ హుండీ

ఆదాయం రూ.2.38 లక్షలు

కోడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లిలో కృష్ణానది తీరాన కొలువైన అద్దంకి నాంచారమ్మ అమ్మ వారి ఆలయ హుండీ ఆదాయం రూ.2,38,400 వచ్చినట్లు ఆలయ ఈవో సిహెచ్.సుధాకర్ తెలిపారు. కానుకలు మచిలీపట్నం దేవాదాయశాఖ అధికారి కె.శ్రీనివాసరావు స్థానిక గ్రామస్థుల సమక్షంలో లెక్కించినట్లు తెలిపారు.

జీవాలకు నట్టల నివారణ మందు

బంటుమిల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పశుసం వర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం గొర్రెలకు, మేకలకు నట్టల నివారణా టీకాలు వేస్తున్నామని పశుసంవర్ధకశాఖ వైద్యాధికారిణి డాక్టర్ స్ఫూర్తి తెలిపారు. మండలంలోని దాదాపు 12వేల గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ ఇస్తున్నామని దానిలో భాగంగా మల్లేశ్వరంలో దాదాపు మూడు వేల జీవాలకు నట్టల నివారణా వ్యాక్సిన్ వేశారు. మచిలీపట్నం పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగభూషణం పాల్గొని మేకల, గొర్రెల కాపరులకు పలు రకాల వ్యాధులకు సూచనలు, సలహాలు, జాగ్రత్తలు చెప్పారు.

మద్యం దుకాణం తనిఖీ

మోపిదేవి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల వద్ద మద్యం సేవించటం జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అవనిగడ్డ ఎక్సైజ్ సీఐ గిరిజ సత్యకుమారి చెప్పారు. మంగళవారం మోపి దేవి బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఆమె తనిఖీ చేశారు.



తనిఖీలో ఎక్సైజ్ సీఐ గిరిజ సత్యకుమారి

రత్నకోడులో అక్రమ తూములను తొలగించండి



కోడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రత్నకోడు డ్రెయిన్ నుంచి న్యూ ఇరాలి డ్రెయిన్ వైపునకు ఆక్వా రైతులు అక్రమంగా వేసిన తూములను తొలగించాలని హంసలదీవి, పాలకాయి తిప్ప, దింటిమెరక గ్రామ రైతులు మండలి వెంకట్రామ్‌ని కోరారు. మంగళవారం కోడూరు మం డల పరిధిలోని ఉల్లిపాలెం, హంసలదీవి, పాలకా యితిప్ప, దింటిమెరక, రామకృష్ణాపురం గ్రామాల్లో ముంపునకు గురైన పంటపొలాలను ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్, ఆర్‌సీ ఏఈ వెంకటేశ్వరరావుతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు మర్రె గంగయ్య, దేవనబో యిన వెంకటేశ్వరరావు, విజ్జినేని శివాజీ, కొక్కిలిగడ్డ సముద్రాలు, కొక్కిలిగడ్డ బిక్షాలు, కోట రాంబాబు, ఉల్లి శేషగిరి రావు, అద్దంకి పాండురంగారావు, బచ్చు వెంకటేష్, గోగినేని సోమశేఖర రావు, కాగిత రామారావు, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేను పారదర్శకంగా జరిపించండి..

ఘంటసాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వేను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిపించాలని శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) అధికారులకు సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేమూరి రజనికుమారి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జరిపిన శాశ్వత భూహక్కు రీ సర్వేలో రెవెన్యూ శాఖ వారు అవకతవకలకు పాల్పడ్డారని, దానికి సంబంధించిన ఆధారాలు కూడా తనవద్ద ఉన్నాయని తెలిపారు. శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ మాట్లాడుతూ, ఎస్సీ సొసైటీకి సంబంధించిన భూములను అనర్హులకు కూడా పట్టాలిచ్చారని, వారిని తొలగించి అర్హులకు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఎంపీడీవో డి.సుబ్బారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

పెడన, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగావకాశాలు పొందాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పి.బి. సాల్మన్‌రాజు సూచించారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ వంగా బాబు, ప్రిన్సిపాల్ రూపానాగశ్రీ మాట్లాడు తూ, జాబ్‌మేళాలో ఎంపికైన నిరుద్యోగులు ఉద్యోగం చిన్నదా పెద్దదా అని చూడకుండా వెంటనే ఉద్యోగాలలో చేరిపోవాలని, చేరిపోతే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. జాబ్‌మేళాకు 143 మంది హాజరు కాగా వారిలో 13 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 35 మంది తదుపరి ఇంటర్వ్యూకు అర్హత సాధించారు.

పింగళి వెంకయ్యకు సముచిత గౌరవం



పింగళి విగ్రహం వద్ద కూటమి నేతల నివాళి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు కూటమి ప్రభుత్వంలో సముచిత గౌరవం లభించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మెడికల్ కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెట్టిన సందర్భంగా మంగళవారం మచిలీపట్నం పోలీసు స్టేషన్ పక్కన ఉన్న పింగళి వెంకయ్య విగ్రహానికి గొర్రెపాటి గోపీచంద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, బీజేపీ సీనియర్ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, జనసేన నాయకుడు కర్రి మహేష్, మైకేల్, ఫణి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి: మంత్రి రవీంద్ర



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విలువలతో కూడిన విద్యను అందిం చేందుకు దివంగత కొమరగిరి కృష్ణమోహనరావు కృషి చేశారని, ఆ బాటలో పాఠశాలలను తరు వాత తరం నడుపుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం రాత్రి నూతనం గా సంస్కృతి కిడ్స్ పాఠశాలను మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్డీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత కొమరగిరి చంద్రశేఖర్‌తో పాటు టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీ చంద్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, తూమాటి బసవేశ్వరరావు, కొమరగిరి శ్యామ్, ఇకె బాలభాను విద్యా సంస్థ అధినేత రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు శిబిరానికి విశేష స్పందన

చల్లపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి ఏటీఎం సెంటరులో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు శిబిరానికి విశేష స్పందన లభించింది. యువనేత మండలి వెంకట్రామ్ శిబిరాన్ని సందర్శించి పట్టభద్రుల నుంచి దర ఖాస్తులు స్వీకరించారు. ప్రత్యేక శిబిరంలో సుమారు 250 మంది దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు రావి సూర్యకిరణ్‌తేజ, చంద్రమౌళి, మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, తోట కనకదుర్గ, కూటమి నేతలు మోర్ల శివ, బోలెం నాగమణి, షేక్ నబీషోరి, నిడమానూరి దిలీప్‌కుమార్, సూదాని నందగోపాల్ పాల్గొన్నారు.

● **నాగాయలంక :** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు కోరారు. మంగళవారం నాగాయలంకలోని వంగవీటి రంగా బొమ్మ సెంటర్‌లో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప్పల ప్రసాద్, లంకే శ్రీనివాసప్రసాద్, మంచాల మహేంద్రకుమార్, నాగిడి పోతురాజు, ముప్పరాజు సందీప్, కన్నా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మోదుమూడిలో మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామివారికి పూలమాలలు వేసి 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పఠనం చేశారు. ఈ సందర్భంగా సప్తసప్తాహ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. దివి పార్థసారథి ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించగా, భక్తులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులకు దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయానికి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు తరలివచ్చారు. నాలుగు డేటా ఎంట్రీ ఆపరేటర్, నాలుగు ల్యాబ్ టెక్నీషీ యన్, రెండు ఫార్మసిస్టు గ్రేడ్ 2, పది క్లాస్ 4 ఉద్యోగాలకు జిల్లా నలుమూలల నుంచి అభ్యర్థులు దరఖాస్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

కోడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోడూరు నుంచి ద్విచక్ర వాహ నంపై అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చాణిక్య తెలిపారు. మంగళవారం స్థానికులు తెలిపిన సమాచారం మేరకు కోడూరు నుంచి నరసింహాపురం వైపునకు విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన ముప్పిరిశెట్టి శివయ్య అనే వ్యక్తి తరలిస్తున్న 45 మద్యం బాటిళ్లను స్వాధీనపర్చుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

రేషన్‌బియ్యం స్వాధీనం

అవనిగడ్డ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ మీదుగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకుని తనిఖీలు చేసినట్లు కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్టేట్‌బ్యాంక్ సెంటర్‌లో సుమారు నాలుగు టన్నుల రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను గుర్తించి , రేషన్ బియ్యం తరలిస్తున్న పెదకళ్లేపల్లి గ్రామస్థుడు కూతాడ వెంకన్న బాబును అదుపులోకి తీసుకుని, అతనిపై కేసు నమోదు చేసి సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫెన్సింగ్‌కు అనుమతివ్వండి

నాగాయలంక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక ప్రధాన సెంటర్‌లో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకునేందుకు పంచాయతీ అనుమతి ఇవ్వాలని మండల ఎస్సీ నేతలు కోరారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి జె.పవన్ కుమార్‌కి ఎస్సీ నేతలు మంచాల తిరుపతి వర ప్రసాద్, బట్టు జయపాల్, తానంకి పోతురాజు, ఎన్.బాబూరావు, దాసరి శేఖర్, కె.శంకరరావు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.

ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్‌కు పదోన్నతి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న ఎస్.వి.డి. ప్రసాద్ విజయవాడ సిటీ సెక్యూరిటీ వింగ్ ఎస్పీగా పదోన్నతిపై బదిలీ అవుతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు వీడ్కోలు పలికారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం పదిలం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మచిలీప ట్నం మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. బందరు మండలం కానూరు గ్రామంలో మంగళవారం బంగారు బందరు కార్యక్రమంలో భాగంగా రోడ్ల పక్కన ఉన్న ముళ్లకంపలను తొలగించారు. ఈ కార్యక్రమంలో దివి మహేష్, గోపు వెంకటరమణ, బొలిశెట్టి నాని, ఈవన వెంకన్న, వంకా కాశీ, బోట్ల రాజేష్, వంకా నందేశ్వరరావు, పెద్దిరాజులు, మరీదు రాఘవరావు, గుళ్ళపల్లి శరత్ పాల్గొన్నారు.

